www.prajavinikidi.com    RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం    తెలుగు దినపత్రిక

సంపుటి - 3  సంచిక -294  శుక్రవారం 30 జనవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్  పేజీలు -8 వెల - 3/-  01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా వినికిడి తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# కెసిఆర్‌కు సిట్ నోటీసులు






## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

## నేటి మధ్యాహ్నం విచారణ చేపడతామని వెల్లడి

హైదరాబాద్,**జనవరి29ప్రజావినికిడి**

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. వయసు దృష్ట్యా పీఎస్‌కు రావాల్సిన అవసరం లేదని సిట్ పేర్కొంది. ఈ కేసులో ఇటీవల మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు మాజీ ఎంపీ సంతోష్‌రావును సిట్ విచారించిన విషయం తెలిసిందే. ప్రధానంగా ఇప్పటివరకు ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్ రావులను సిట్ విచారించిన విషయం తెలిసిందే. తాజాగా.. కేసీఆర్‌నూ విచారించాలని సిట్ నిర్ణయించింది. ఇందులో భాగంగానే విచారణ చేపట్టేందుకు సిట్ అధికారులు సన్నద్ధమైనట్టు సమాచారం. రెండేళ్లుగా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు తుది అంకానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సిట్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి.. సీపీ సజ్జనార్ నేతృత్వంలో మార్పులు చేర్పులు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన పోలీస్ అధికారులను విచారించి, వారిని రిమాండ్‌కు తరలించారు. ఆ తరువాత ఫోన్ ట్యాపింగ్‌లో బాధ్యులుగా ఉన్నవారిని విచారించి వారి నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా.. మాజీ ముఖ్యమంత్రిని సిట్ అధికారులు విచారించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే కేసీఆర్ ఈ విచారణకు హాజరవుతారా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది. **మిగతా 2లో...**

### మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మరో తేదీ ఇవ్వాలన్న కేసీఆర్

**నేడు నిర్ణయం తీసుకుంటాం : సిట్ అధినేత సజ్జనార్**

**కేసీఆర్‌కు నోటీస్‌పై రోజంతా హల్‌చల్**

**ఈ కేసు సిల్లీ విషయం : కేసీఆర్**

# దేశ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయాలు

## ఐరోపా సమాఖ్యతో ఒప్పందంపై మోడీ

## రాష్ట్రపతి ప్రసంగం ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించదని వ్యాఖ్య




న్యూఢిల్లీ,**జనవరి29ప్రజావినికిడి**

పార్లమెంటు సమావేశాలు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మీడియాతో ప్రధాని మోదీ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీ పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం**మిగతా 2లో...**



# అశ్రునయనాల మధ్య అజిత్ పవార్ అంత్యక్రియలు

**ప్రభుత్వ లాంఛనాలతో దివంగత నేతకు వీడ్కోలు**

**కేంద్రహోంమంత్రి అమిత్ షా తదితరుల నివాళి**

ముంబై,**జనవరి29ప్రజావినికిడి**

అశ్రునయనాల మధ్య దివంగత మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం ఉదయం పుణెలోని బారామతి సమీపంలోగల విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. పవార్ పెద్దకుమారుడు అంత్యక్రియలను నిర్వహించారు. అంతకముందు..**మిగతా 2లో...**



# మామునూరు ఎయిర్‌పోర్ట్ కల సాకారంకాబోతోంది

## కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు



హైదరాబాద్,**జనవరి29ప్రజావినికిడి** :రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి చొరవ వల్లే మమునూరు ఎయిర్‌పోర్ట్ కల నెరవేరుతోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. స్వాతంత్ర్యం రాకముందు మమునూరు అతిపెద్ద ఎయిర్‌పోర్ట్‌గా ఉండేదని అన్నారు. మమునూరు ఎయిర్‌పోర్ట్‌కు 696 ఎకరాలు మాత్రమే ఉందని, అయితే 180 సీట్ల విమానం దిగాలి అంటే రన్ వే పొడవు 2500 మీటర్లు ఉండాలని మంత్రి తెలిపారు. మునూరు ఎయిర్‌పోర్ట్ కల నెరవేరాలంటే మరో 259ఎకరాలు అవసరమని మంత్రి తెలిపారు. గతంలో ఎవరూ ఆ భూమిని సేకరించలేదని, అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం**మిగతా 2లో...**



# 7.2 శాతానికి జీడీపీ వృద్ధి

**పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే**

**ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్**

న్యూఢిల్లీ,**జనవరి29ప్రజావినికిడి**

దేశ ఆర్థిక గమనానికి దిక్సూచిగా నిలిచే ఆర్థిక సర్వేను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2025-26 ఆర్థికసర్వే ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత రాజ్యసభలో కూడా మంత్రి సర్వేను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం **మిగతా 2లో...**

# పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

**స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానం అవలంబిస్తున్న తెలంగాణ**

**గాలి నాణ్యత పర్యవేక్షణకు రాష్ట్రంలో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు**

**కాలుష్య ఫిర్యాదులపై వేగంగా స్పందించేందుకు ప్రత్యేక బృందాలు**

**గాలి నాణ్యత సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి**



హైదరాబాద్,**జనవరి29ప్రజావినికిడి** పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది అందుకే ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుందనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు**మిగతా 2లో...**

# యూజీసీ 2026 నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే




**యూజీసీ 2026 సమానత్వ నిబంధనలను నిలిపివేసిన సుప్రీంకోర్టు**

**తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు 2012 నిబంధనలే అమల్లో ఉంటాయని ఆదేశం**

**జనరల్ కేటగిరీకి అన్యాయం చేసేలా ఉన్నాయని దాఖలైన పిటిషన్లపై విచారణ**

**ఈ నిబంధనలు సమాజాన్ని విభజించే ప్రమాదం**


# వీధికుక్కల సమస్య... తీర్పు రిజర్వ్

**వీధి కుక్కల నిర్వహణ... సుప్రీంకోర్టులో విచారణ**

**విచారణలో అన్ని వర్గాల వాదనలు విన్న త్రిసభ్య ధర్మాసనం**

**కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాల సంఖ్యపై తప్పుడు లెక్కలున్నాయని ఆందోళన**

**కుక్కలను షెల్టర్లకు తరలించాలన్న గత ఆదేశాలను సవరించిన ధర్మాసనం**



# కొలువుదీరిన వనదేవతలు

**మేడారంలో దర్శనానికి పోటెత్తనున్న భక్తులు**

**ముగిసిన సమ్మక్క ఆగమన ఘట్టం**

**మంత్రులు పొంగులేటి, సీతక్క పర్యవేక్షణ**

వరంగల్ **జనవరి29ప్రజావినికిడి**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర 'మేడారం' మహా ఘట్టం చివరి అంకానికి చేరుకుంది. గురువారం సాయంత్రం చిలుకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి గద్దెపైకి చేరుకోవడంతో వనదేవతలందరూ కొలువుదీరినట్టయింది. ముందుగా సమ్మక్కను సాయంత్రం 7:15 గంటలకు ప్రధాన పూజారి కొక్కర్ల కిష్టయ్య తీసుకొస్తూ చిలకలగుట్ట దిగగానే జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథన్ కేకన్ గాలిలో కాల్పులు జరిపి స్వాగతం పలికారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్, అధికార యంత్రాంగం ఆదివాసీ ప్రజా ప్రతినిధుల**మిగతా 2లో...**



# అశ్రునయనాల మధ్య అజిత్ పవార్ అంత్యక్రియలు

(మొదటి పేజీ తరువాయి)
కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నితిన్ నబిన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ శ్రద్ధాంజలి ఘటించారు. తమ అభిమాన నేతకు తుది వీడ్కోలు పలికేందుకు ప్రతిష్ఠాన్ మైదానానికి ప్రజలు పోటెత్తడంతో ఆ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది. ప్రభుత్వ లాంఛనాల నడుమ తండ్రి చితికి ఆయన కుమారుడు నిప్పంటించారు. అజిత్ పవార్‌కు తుది వీడ్కోలు పలుకుతూ ఆయన భార్య సునేత్ర, ఇతర కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. అజిత్ పవార్‌ను కోల్పోయినందుకు పార్టీ నేతలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. బుధవారం ఉద్యం విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్ అంత్యక్రియలు బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌లో ప్రభుత్వ లాంఛనాలతో చేపట్టారు. గురువారం ఉదయం ప్రారంభమైన అంతిమ యాత్రలో వేల మంది అభిమానులు పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఏపి మంత్రి నారా లోకేష్ సహా చాలా మంది ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.బారామతి విమానాశ్రయం దగ్గర జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ (66) మరణించారు. ఈ దుర్ఘటనలో మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. అజిత్ పవార్ మృతదేహాన్ని మంగళవారం రాత్రి పుణ్యశ్లోక అహిల్యాదేవి ఆస్పత్రి





నుంచి.. కాటేవాడిలోని ఇంటికి తరలించారు. ఉదయం 9 గంటలకు విద్యా ప్రతిష్ఠాన్ క్యాంపస్ నుంచి అంతిమ యాత్ర మొదలైంది. పూలతో అలంకరించిన రథంలో మృతదేహాన్ని తీసుకెళ్లారు. నగరంలోని ప్రధాన రోడ్ల గుండా ఈ యాత్ర సాగింది. 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ అభిమానులు నినాదాలు చేశారు. తర్వాత భౌతికదేహాన్ని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌కు చేర్చారు. అక్కడ రాష్ట్ర లాంఛనాలతో అంతిమ సంస్కారాలు జరిగాయి. అజిత్ పవార్ కుమారులు చివరి క్రియలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, శరద్ పవార్, సుప్రియా సూలే సహా అన్ని పార్టీల నేతలూ పాల్గొన్నారు. అజిత్ పవార్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడి, ఇతర ప్రముఖులు సంతాపం ప్రకటించారు. మరోవైపు విమాన ప్రమాదంపై డీజీసీఏ, ఏఏఐబీ దర్యాప్తు మొదలైంది. బ్లాక్‌బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దట్టమైన పొగమంచు, విజిబులిటీ తక్కువగా ఉండటమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక సమాచారం. ఐతే.. దర్యాప్తు తర్వాత పూర్తి నివేదిక వస్తుంది. అందులో ఏం చెబుతారన్నది తేలాల్సిన అంశం. అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రలో మూడు రోజుల రాష్ట్ర సంతాప దినాలు ప్రకటించారు. ఆయనది ప్రమాద మరణమా, లేక కుట్ర పూరిత హత్యా అనే సందేహాలు ఉన్నాయి. అయితే ఈ అనుమానాలను శరద్ పవార్ తోసిపుచ్చారు.

# యూజీసీ 2026 నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే

**యూజీసీ 2026 సమానత్వ నిబంధనలను నిలిపివేసిన సుప్రీంకోర్టు**

**తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు 2012 నిబంధనలే అమల్లో ఉంటాయని ఆదేశం**

**జనరల్ కేటగిరీకి అన్యాయం చేసేలా ఉన్నాయని దాఖలైన పిటిషన్లపై విచారణ**

**ఈ నిబంధనలు సమాజాన్ని విభజించే ప్రమాదం ఉందన్న ధర్మాసనం**

న్యూఢిల్లీ,**జనవరి29ప్రజావినికిడి**
ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీసుకొచ్చిన 2026 నిబంధనల అమలుపై సుప్రీంకోర్టు ఇవాళ మధ్యంతర స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు 2012 నాటి పాత నిబంధనలే అమల్లో




ఉంటాయని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వానికి, యూజీసీకి నోటీసులు జారీ చేసింది.
యూజీసీ కొత్త నిబంధనలు జనరల్ కేటగిరీ విద్యార్థుల పట్ల వివక్ష చూపించేలా ఉన్నాయని, వారికి ఫిర్యాదు చేసే యంత్రాంగాన్ని నిరాకరిస్తున్నాయని ఆరోపిస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. "మేము జోక్యం చేసుకోకపోతే, ఇది ప్రమాదకరమైన ప్రభావాన్ని చూపుతుంది. సమాజాన్ని విభజిస్తుంది, తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది" అని ధర్మాసనం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది.
కొత్త నిబంధనల ప్రకారం 'కుల ఆధారిత వివక్ష' అనే పదాన్ని కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకే పరిమితం చేశారని పిటిషనర్లు ఆరోపించారు. దీనివల్ల జనరల్ కేటగిరీకి చెందిన వారికి ఎలాంటి వివక్ష ఎదురైనా ఫిర్యాదు చేసే అవకాశం లేకుండా పోతుందని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15(1), 21లను ఉల్లంఘించడమేనని వాదించారు.
పిటిషనర్ల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, 'సంపూర్ణ న్యాయం' కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తమకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించి ఈ నిబంధనలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. అనంతరం తదుపరి విచారణను మార్చి 19వ తేదీకి వాయిదా వేసింది.

# 7.2 శాతానికి జీడీపీ వృద్ధి

(మొదటి పేజీ తరువాయి)
ఆనవాయితీగా వస్తోంది.గత ఆర్థిక సంవత్సరంలో భారత్ సాధించిన అభివృద్ధి, ఎదురైన సవాళ్లు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలు తదితర కీలక విషయాలను ఆర్థిక సర్వేలో ప్రస్తావిస్తారన్న విషయం తెలిసిందే. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత దేశ రియల్ జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని ఆర్థిక సర్వే తేల్చింది. సుస్థిర దేశీయ డిమాండ్, స్థూల ఆర్థిక అంశాలు సానుకూలంగా ఉండటంతో భారత ఆర్థిక ప్రగతికి ఢోకా లేదని ఆర్థిక సర్వే తేల్చింది. ఈ సర్వే ప్రకారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి కాస్త ఆందోళనకరంగానే ఉంది. ప్రతికూల అంశాల ప్రాబల్యం కొనసాగు తోంది. ఫలితంగా ప్రపంచ ఆర్థిక ప్రగతి ఓ మోస్తరు స్థాయిలోనే కొనసాగుతుంది. స్థూలంగా చూస్తే వస్తువుల ధరలు ఈ ఏడాదిలో స్థిరంగా కొనసాగే అవకాశం ఉంది. కృత్రిమ మేధతో ఆశించిన మేర ఆర్థిక ఫలాలు అందకపోతే ఆస్తుల విలువ తరిగి ఆర్థికరంగంపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత నెమ్మదించవచ్చు. ప్రస్తుత పరిస్థితి నిలకడగా ఉన్నా రాబోయే రోజుల్లో ప్రతికూలతలు పెరిగి పరిస్థితి వికటించే అవకాశం ఉందని కూడా ఆర్థిక సర్వే అంచనా వేసింది.అమెరికా సుంకాల భారం ఉన్నా భారత ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసిందని ఆర్థిక సర్వే తేల్చింది. సుంకాల విధింపు తరువాత జీడీపీ వృద్ధి అంచనాలు తగ్గినా వాస్తవంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చేపట్టిన వ్యవస్థాగత మార్పులు, విధానపరమైన నిర్ణయాల కారణంగా సుంకాల భారాన్ని భారత్ తట్టుకోగలిగిందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనామిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అ్గ÷ర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనామిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్ తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బ్జడెట్‌కు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ.. దేశ జీడీపీ 6.8-7.2 శాతంగా ఉండొచ్చు. గతేడాదితో పోలిస్తే అంచనాలను పెంచింది. 2025-2026కు జీడీపీ అంచనాలను 7.4 శాతం నుంచి తగ్గించింది. ఇటీవల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4? వృద్ధి రేటు నమోదుకావొచ్చని గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వశాఖ అంచనా వేసిన సంగతి తెలిసిందే. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.8శాతం. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో అది 4.4 శాతంగా ఉంటుందని సర్వే అంచనా వేసింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ.. 2026-2027కు భారత్‌లో స్థిరమైన వృద్ధి నమోదవు తుందని అంచనా వేసింది.వికసిత్ భారత్‌ను సాధించడంలో వ్యవసాయరంగం కీలకపాత్ర పోషిస్తుంది. దేశీయంగా తయారీ, ఎగుమతులు ఎలక్ట్రానిక్ రంగం వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఇందులో మొబైల్ తయారీ కీలకం. పదేళ్లలో ఉత్పత్తి విలువ 30 రెట్లు పెరిగి.. రూ.18వేల కోట్ల నుంచి రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. డిజిటల్ సేవల విషయంలో గ్రామాలు, పట్టణాల మధ్య అంతరం తగ్గుతోంది. ఇటీవల భారత్-ఈయూ మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ గురించి ప్రస్తావించింది.

# కెసిఆర్‌కు సిట్ నోటీసులు

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మరో తేదీ ఇవ్వాలన్న కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)
నేడు(30న) మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ అనీ, ఆ రోజు తాను తన పార్టీ అభ్యర్థులకు ధ్రువపత్రాలను సంతకం చేసి అందించాల్సి ఉంటుందనీ, ఆ పనిలో బిజీగా ఉండటం వల్ల విచారణకు రాలేనని లేఖలో వివరించారు. మరోరోజు ఎప్పుడైనా పిలిస్తే విచారణకు హాజరవుతానని కేసీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు. తాను మాజీ ముఖ్యమంత్రిని, ప్రతిపక్ష నేతను కావడం వల్ల చట్టాన్ని గౌరవిస్తానని అన్నారు. అలాగే తన చిరునామా నందినగర్‌గాక ఎర్రవెల్లిలో ప్రస్తుతం తానుంటున్న ఫాంహౌస్‌నే తన నివాసంగా గుర్తించి ఇకపై ఎలాంటి నోటీసులున్నా అక్కడికే పంపాలని అధికారులను కోరారు. ఇక విచారణను కూడా తన ఎర్రవెల్లిలోని నివాసంలోనే జరపాలనీ, సెక్షన్ 160 సైతం 65 ఏండ్లు దాటిన వ్యక్తులను వారు కోరుకున్న చోటే విచారించాలని చెప్తుందని కేసీఆర్ ఉదహరించారు.

మరో తేదీని నేడు నిర్ణయిస్తాం : సిట్ చీఫ్ సజ్జనార్
30వ తేదీన విచారణకు తాను హాజరుకాలేనంటూ కేసీఆర్ పంపిన లేఖ తమకు అందిందని సిట్ అధినేత, నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ గురువారం రాత్రి వెల్లడించారు. ఈ విషయమై తాము సానుకూలంగా ఉన్నామనీ, శుక్రవారం తిరిగి కేసీఆర్‌ను ఏ రోజు విచారించేది నిర్ణయిస్తామని చెప్పారు. కాగా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసే అవకాశముందని తెలుస్తోంది.
ఈ కేసు సిల్లీ విషయం : కేసీఆర్
ఫోన్‌ట్యాపింగ్ అనేది అత్యంత సిల్లీ విషయమనీ, దీనిని గోరంతలు కొండంతలు చేస్తున్నారని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 2024లో ఒక ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తనకు ప్రతి రోజూ తెల్లవారుజామున ఇంటెలిజెన్స్ అధికారులు రాష్ట్రంలో పరిస్థితి గురించి సమాచారం ఇవ్వడం జరిగేదనీ, అందులో శాంతి భద్రతలు, నేరాలు, మావోయిస్టులు, సమాజంలో పరిస్థితి, ప్రభుత్వ అనుకూలత, వ్యతిరేకత తదితర అనేక అంశాలు వారి సమాచారంలో ఇమిడి ఉండేవని ఆయన తెలిపారు.
ఈ సమాచార సేకరణలో ఫోన్‌ట్యాపింగ్ జరపడమనేది సర్వసాధారణమనీ, కానీ వారు తాము ఈ సమాచారాన్ని ఎలా సేకరించామనేది చెప్పేవారు కాదు, నేను అడిగేవాడిని కాదు అని అన్నారు. ప్రధానమంత్రి మొదలుకొని ముఖ్యమంత్రుల వరకు గూఢాచార్య వ్యవస్థను పాలనలో భాగంగా ఉపయోగిం చుకోవడం సర్వసాధారణమనీ, ఈ నేపథ్యంలో ఫోన్‌ట్యా పింగ్ అంటూ ఈ ప్రభుత్వం గగ్గోలు పెట్టడం సిల్లీ విషయమనీ, తన ప్రతిష్టను దిగజార్చాలనే కుట్రతోనే కేసులంటూ వ్యవహారాలు సాగిస్తోందని ఆ సమయంలో కేసీఆర్ ఆరోపించారు. గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూ ఆధారంగానే సిట్ విచారణలో తాను చెప్పాల్సిన అంశాలకు కేసీఆర్ పదును పెడుతున్నారని తెలిసింది.

# దేశ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)
ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని అన్నారు. ప్రజల అభివృద్ధి సౌభాగ్యాలే లక్ష్యంగా పథకాలు, నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా తామూ మారతామని చెప్పారు. అయితే, ప్రజలకు మేలు చేకూర్చే విధంగా తమ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటూ సాంకేతికతను జోడించి ముందుకు సాగుతామని అన్నారు. ప్రజల స్థానాన్ని సాంకేతికత భర్తీ చేయజాలదని కూడా ప్రధాని స్పష్టం చేశారు. ÷ాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని అన్నారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణమని చెప్పారు. ఇక ఈయూతో వాణిజ్య ఒప్పందంతో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ప్రధాని తెలిపారు. ఈ ఒప్పందం నుంచి భారత పారిశ్రామిక వర్గాలు లబ్దిపొందాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులను ఈయూ దేశాలకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఐరోపా సమాఖ్యతో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించారు. అది శుభసూచికమన్నారు. రీఫార్మ్-పెర్ఫామ్-ట్రాన్స్‌ఫామ్ అంటూ బ్జడెట్ టోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం భారత్ రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుకెళ్తోందని, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని చెప్పారు. అలాగే సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదని మోదీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించింది. ప్రపంచానికి భారత్ ఆశాకిరణం. అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా భారత్ దూసుకెళ్తోంది. వికసిత్ భారత్ కోసం ఎంపీలు కృషి చేయాలి. పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు లభిస్తుండటంతో భారత్‌ను సుస్థిరదేశంగా ప్రపంచం చూస్తోంది. ట్రేడ్‌డీల్‌తో కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వాటినుంచి తయారీదారులు లబ్ది పొందాలని కోరుతున్నాను. ఈయూలోని 27 దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలని పేర్కొన్నారు. మనం టెక్నాలజీతో పోటీపడతాం. దానిని అందిపుచ్చుకుంటాం. దాని సామర్థ్యాన్ని అంగీకరిస్తాం. అయితే అది మనుషులను భర్తీ చేయలేదని అన్నారు.

# వీధికుక్కల సమస్య...తీర్పు రిజర్వ్

**వీధి కుక్కల నిర్వహణ... సుప్రీంకోర్టులో విచారణ**

న్యూఢిల్లీ,**జనవరి29ప్రజావినికిడి**
దేశవ్యాప్తంగా వీధి కుక్కల నిర్వహణ, ప్రజల భద్రతకు సంబంధించిన సుమోటో కేసులో సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ భారత జంతు సంక్షేమ బోర్డు సహా అన్ని వర్గాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ నిర్ణయం తీసుకుంది. వారం రోజుల్లోగా తమ లిఖితపూర్వక వాదనలను సమర్పించేందుకు అన్ని పక్షాలకు సమయం ఇచ్చింది.విచారణ సందర్భంగా, వీధి కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాల లెక్కల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని జంతు సంక్షేమ బోర్డు కోర్టు దృష్టికి తెచ్చింది. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందినవి 76 కేంద్రాలు మాత్రమే ఉండగా, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం 883 ఉన్నాయని నివేదికలు సమర్పించాయని తెలిపింది. ఈ లెక్కల్లోని తేడాలపై, నిధుల వినియోగంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. గుర్తింపు కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని జంతు సంక్షేమ బోర్డును ఆదేశించింది.ఈ సుమోటో విచారణలో భాగంగా కుక్కల ప్రేమికులు, కుక్కకాటు బాధితులు, జంతు హక్కుల కార్యకర్తల వాదనలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. యానిమల్ బర్త్ కంట్రోల్ ÷ూదీజ) నిబంధనల అమలు, ప్రజల భద్రత, కుక్కల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించడం వంటి అంశాలపై ఈ కేసు దృష్టి సారించింది.గతంలో, 2025 ఆగస్టులో జస్టిస్ జె.బి. పార్దివాలా నేతృత్వంలోని మరో ధర్మాసనం ఢిల్లీ-ఎన్సీఆర్‌లో వీధి కుక్కలన్నింటినీ వెంటనే పట్టుకుని షెల్టర్లకు తరలించాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఆ తీర్పుపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రస్తుత త్రిసభ్య ధర్మాసనం ఆ ఉత్తర్వులను సవరించింది. కుక్కలను తరలించే బదులు, ÷ూదీజ నిబంధనల ప్రకారం వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసి తిరిగి అవే ప్రాంతాల్లో వదిలిపెట్టాలని స్పష్టం చేసింది. తాజాగా వాదనలు ముగియడంతో తుది తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

# కొలువుదీరిన వనదేవతలు

(మొదటి పేజీ తరువాయి)
మధ్య, పోలీసులు భారీ బందోబస్తు నడుమ సమ్మక్క ఆగమనం ప్రారంభమైంది. సమ్మక్కను వడ్డెలు తీసుకొస్తుండగా మహిళల నృత్యాలు, శివసత్తుల పూనకాల నడుమ ఈ కార్యక్రమం కొనసాగింది.
రహదారికి అడ్డంగా కోళ్లు, గొర్రెలను బలిస్తూ స్వాగతం పలికారు. కాగా, నేడు(శుక్రవారం) తల్లుల దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై కొలువుదీరడం తో భక్తుల రద్దీ అధికంగా ఉండనుంది. భక్తులకు క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర మంత్రులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. పొంగులేటి, అడ్లూరి గురువారం ఉదయం బైక్‌లపై ప్రయాణించి జాతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్‌తో కలిసి జంపన్న వాగు వద్ద భక్తుల స్నాన ఘట్టాలను, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.
అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని, తప్పిపోయిన వారి కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు తగు సూచనలు చేస్తూ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. అలాగే, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరం మేడారం చేరుకున్నారు. వారికి రాష్ట్ర మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డోలు, డప్పులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు తులాభారం వేయించుకున్నారు. కిషన్ రెడ్డి 75 కేజీలు, జువల్ ఓరం 86 కేజీల బంగారాన్ని అమ్మవార్లకు మొక్కుగా సమర్పించుకున్నారు.

# మామునూరు ఎయిర్‌పోర్ట్ కల సాకారంకాబోతోంది

(మొదటి పేజీ తరువాయి)
రికార్డ్ టైమ్‌లో రైతులను ఒప్పించి భూమి సేకరించిందని ప్రశంసించారు. ఏవియేషన్ మంత్రిగా ఎక్కువ ఎయిర్‌పోర్ట్‌లు నిర్మించాలనేది తన లక్ష్యమని, రాష్ట్రాలు సహకరించి భూములు ఇస్తే కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ తర్వాత గొప్ప వారసత్వ నగరమైన వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నా.. నిర్మాణం చేసుకోలేక పోయామని, ఇప్పుడు ఆ కల నెరవేరుతోందని అన్నారు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ 5వేల ఎకరాల్లో నిర్మిస్తామంటే అందరూ నవ్వారని, అన్ని వేల ఎకరాలు ఉండటం వల్లే నేడు ఆపరేషన్, మెయింటెనెన్స్, రిపేర్ కేంద్రాలకు వీలు అవుతోందని మంత్రి పేర్కొన్నారు. అందువల్లే హైదరాబాద్ ఏవియేషన్ హబ్‌గా ఎదిగిందన్నారు. పోటీపడి రాజకీయాలు చేయడం కాదు.. అభివృద్ధి చేయాలని తమ గురువు చంద్రబాబు నేర్పించారని అన్నారు. తెలంగాణను కూడా అభివృద్ధి చేయాలని తమ గురువు చంద్రబాబు చెప్పారని మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)
సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ ముందుకు వెళుతుందని అన్నారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి విభాగం లో 'గాలి నాణ్యత సూచీ మరియు గాలి నాణ్యత నిర్వహణ' అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సదస్సు స్పష్టమైన, ఉన్నత లక్ష్యం ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం స్వచ్ఛమైన గాలి అన్నారు. నేడు తెలంగాణ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటి, హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగింది, ఈ అభివృద్ధి మనకు గర్వకారణం అని తెలిపారు.అదే సమయంలో ఇది మనపై బాధ్యతను కూడా మోపుతుంది అన్నారు. అభివృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణను ఎదురెదురుగా నిలబెట్టలేం, అవి చేతులు కలిపి ముందుకు నడవాలి అని డిప్యూటీ సీఎం అన్నారు.÷ుస్థిర అభివృద్ధి ద్వారా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోందనీ తెలిపారు. అదే సమయంలో జలాశయాల పునరుద్ధరణ, సహజ వనరుల సంరక్షణ, గాలి నాణ్యత మెరుగుదలపై కూడా తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. ఎందుకంటే శుభ్రమైన గాలి లేకుండా జరిగే అభివృద్ధి నిజమైన ప్రగతి కాదు, అది కేవలం ఆలస్యమైన నష్టం మాత్రమే అని వివరించారు. గాలి నాణ్యత ఒక పర్యావరణ సూచీ మాత్రమే కాదు,అది ప్రజారోగ్య సూచీ, అది ఉత్పాదకత సూచీ మరియు అది ఆర్థిక సూచీ కూడా అన్నారు.2024 'స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్' సహా ప్రపంచ స్థాయి అధ్యయనాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపుతున్నాయి అని తెలిపారు. నేడు గాలి కాలుష్యం, అధిక రక్తపోటు తర్వాత, ప్రపంచంలో మరణాలకు రెండో ప్రధాన కారణంగా మారిందనీ, ప్రతి ఏడాది 80 లక్షలకు పైగా అకాల మరణాలకు ఇది కారణమవుతోంది అన్నారు. ఇది మన పిల్లలను, వృద్ధులను, పని చేసే జనాభాను తీవ్రంగా ప్రభావితం చేస్తోందనీ అన్నారు. ప్రపంచ బ్యాంక్ అధ్యయనం ప్రకారం, గాలి కాలుష్యం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏటా నాలుగు ట్రిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లుతోంది, అందుకే శుభ్రమైన గాలి గురించి మాట్లాడినప్పుడు, మనం మనుషుల జీవితాల గురించి,ఆర్థిక బలంపై, సామాజిక శ్రేయస్సు గురించి మాట్లాడుతున్నాం అన్నారు. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో ఒకటిగా ఇప్పటికే గుర్తింపు పొందింది, ఇది మనందరికీ గర్వకారణం,కానీ అదే సమయంలో మన నగర వ్యవస్థలు కూడా అంతే వేగంగా పరిపక్వం చెందాలి అని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు

# బ్రాహ్మణ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలి.

## తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్) జనవరి 29**
తెలంగాణ రాష్ట్రంలో సకల జనుల సర్వేలో 16 లక్షల బ్రాహ్మణ కుటుంబాలు ఉన్నట్లు లెక్కలు తేలుతున్నాయని,కనుక బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి, వారి అభివృద్ధికి కృషి చేస్తే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బ్రాహ్మణ జాతి అంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు అన్నారు. గురువారం నాడు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, బ్రాహ్మణ జాతి అభివృద్ధి చెందేలా రాష్ట్రంలోని బ్రాహ్మణులంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైందని అన్నారు.ఉభయ తెలుగు రాష్ట్రాలుగా రాష్ట్రాలు విడిపోయిన అనంతరం బ్రాహ్మణ సంఖ్యాబలం గణనీయంగా పెరిగిందని ఈ 16 లక్షల బ్రాహ్మణ జాతి ఐక్యం కావలసిన అవసరం ఉందని,ప్రధాని నరేంద్ర మోడీ బిసి అయి ఉండి కూడా అగ్రవర్ణాలలోని పేదలైన రెడ్డి, వెలమ,ఆర్యవైశ్య,బ్రాహ్మణ, మార్వాడి, కులాల కొరకు కేంద్ర ప్రభుత్వం కదిలి వచ్చి ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ అమలు చేసిందని అదేవిధంగా రాష్ట్రంలో 16 లక్షల మంది బ్రాహ్మణులు, ఒకేసారి పిలుపు ఇస్తే



అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పది లక్షలమంది పేద బ్రాహ్మణులు ఉన్నారని వంట బ్రాహ్మణులుగా, పురోహితులగా, అర్చకులుగా, పనిచేస్తున్నారని అన్ని వర్గాలతో మమేకమై జీవనం సాగిస్తున్న బ్రాహ్మణులపై కొన్ని వర్గాలు చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు,సమాజ హితం కొరకు సమాజ శ్రేయస్సు కొరకు ఉన్నటువంటి బ్రాహ్మణ జాతిని అణగారిన వర్గంగా గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అందుకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి బ్రాహ్మణ మేధావులు చర్చ జరపాలని ప్రభుత్వం దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లాలని అన్నారు.గత ప్రభుత్వం నుండి ఈ ప్రభుత్వం వరకు బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పోరాటాన్ని, కొనసాగిస్తూ ఉన్నామని ప్రస్తుత తెలంగాణబ్రాహ్మణ సంఘ సమాఖ్య కృషి చేస్తుందని బ్రాహ్మణ మేధస్సును అన్ని పార్టీలు వాడుకొని వదిలి వేస్తున్నాయని అన్నారు.ఇది చాలా బాధాకరమని అన్నారు. బ్రాహ్మణులు రాజకీయంగా, ఆర్థికంగా సామాజికపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని సర్వేజనా సుఖినోభవంతు అంటూ దీవించే బ్రాహ్మణులకు నామినేటెడ్ పోస్టులలో, కార్పొరేషన్ చైర్మన్,లలో స్థానిక మునిసిపల్ పోరులో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

# ఆర్ఎల్డి పార్టీ గుర్తు ఫుట్‌బాల్




**ప్రజావినికిడి, (ముషిరాబాద్):**
తెలంగాణలోని రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ (ఆర్ఎల్డి) యొక్క మున్సిపల్ ఎన్నికల గుర్తుగా "ఫుట్‌బాల్" ను అధికారికంగా విడుదల చేశారని రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్ఎల్డి) తెలంగాణ అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. ఫుట్‌బాల్ గుర్తు ఐక్యత,బలం, ప్రజాశక్తికి ప్రతీక అని స్పష్టం చేశారు.ఈ మేరకు హైదరాబాద్ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పరిపాలన మాదిరిగానే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీసీ ఎస్సీ ఎస్టీలను మోసం చేస్తుందని ఆరోపించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీసీలు ఎక్కువ సీట్లను సాధించడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. తాము ఏర్పాటు చేసిన పార్టీ కూటమిలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోను, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లోను రాష్ట్రం మొత్తం మీద పోటీ చేస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రజలు గమనించి న్యాయ పరిపాలన జరిగే పార్టీలను గెలిపించాలని ధీమా వ్యక్తం చేశారు.

# శివ స్వాముల మహా పడిపూజకు

## హాజరైన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ప్రజావానికి,(షాద్ నగర్):**హస్తినపురం డివిజన్ పరిధిలోని దేవినగర్ నందు జరిగిన శివస్వాముల మహాపడిపూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి,ఈ సందర్భంగా పన్నెండు మెట్ల పూజనిర్వహించి భజనలు చేశారు.అనంతరం పన్నెండుమెట్లపై పన్నెండు కర్పూరాలు పెట్టి పడి కాల్చారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శివ స్వాములు పడిపూజలో పాల్గొని శివనామస్మరణాన్ని జపించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ భారస అధ్యక్షులు ఆందోజు సత్యంచారి,అనిత,గోపిమధు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదానికి ప్రభుత్వమే కారణం



**ప్రజావినికిడి, (నాంపల్లి):**నాంపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు చనిపోవడంతో ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి కారణమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమ జిల్లోజు సుదర్శన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఆ ప్రాంతాన్ని సందర్శించి అగ్ని ప్రమాదం ఎలా జరిగింగో వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంగ్రేస్ ప్రభుత్వం వచ్చినప్పటినుండిరాష్ట్రంలో ఎక్కవ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇక్కడ ఉండే ప్రతి భవనానికి సెల్లార్ అనుమతులను ప్రభుత్వం ఎలా ఇస్తుందని నిలదీశారు. ఇలాంటి అనుమతులు ఇవ్వడం ద్వారా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఓ భవన నిర్మాణానికి కనీసం సెట్ బ్యాక్ కూడా లేదన్నారు. చనిపోయిన వారికి 5 లక్షలు కాదు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమ జిల్లోజు సుదర్శన్ ప్రభుత్వానికి డిమాండ్‌చేశారు.

# ప్రశాంతమైన వాతావరణం లో ఎన్నికల నిర్వహణ

## - జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజావినికిడి,(రంగారెడ్డి):** జిల్లాలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో జిల్లాలోప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు.
మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయడం జరిగినదని, ఎన్నికలకు సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చుని,ఈ కంట్రోల్ రూమ్ లో (24) గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని, పిర్యాదులను రికార్డ్ చేస్తూ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.జిల్లా ప్రజలు మున్సిపల్ ఎన్నికలు-2026కు సంబంధించి ఫిర్యాదులకై ఈ టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి.నారాయణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలు:**
1.ఆమన్ గల్ కంట్రోల్ రూమ్ నెంబర్ :9032305567
2.చేవెళ్ళ కంట్రోల్ రూమ్ నెంబర్ :9493321468
3.ఇబ్రహీంపట్నం కంట్రోల్ రూమ్ నెంబర్:9032123653
4.మొయినాబాద్ కంట్రోల్ రూమ్ నెంబర్ :7661097839
5షాద్ నగర్ కంట్రోల్ రూమ్ నెంబర్ : 9182403236
6.శంకర్ పల్లి కంట్రోల్ రూమ్ నెంబర్ :738675564 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# జర్నలిస్టు కుటుంబానికి టీడబ్ల్యూజేఎఫ్ మద్దతు..

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన టిబిజేపి అధ్యక్షుడు సామ్రాట్ గుప్తా కుమారుడు

## పరామర్శించిన రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య..

**ప్రజావినికిడి,(హైదరాబాద్):జనవరి 29:**
రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ నాగోల్ రాక్‌టౌన్ కాలనీలోని పవన్ సాయి ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, టీబీజేపి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ గుప్తా కుమారుడు హర్షిత్ తేజను ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య గురువారం పరామర్శించారు.సిద్ధిపేట జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న హర్షిత్ తేజ తన మామయ్యతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందిఈ తీవ్ర ప్రమాదంలో అతనికి కుడికాలు, కుడిచేయి విరిగాయి. ప్రస్తుతం పవన్ సాయి ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, నేడు శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య హర్షిత్ తేజ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, సామ్రాట్ గుప్తా కుటుంబానికి ధైర్యం చెప్పారు. అలాగే వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేసి, టీడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టు కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



# హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి తొమ్మిదిన్నర కోట్లు మంజూరు




**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
హస్తినాపురం డివిజన్ లో వివిధ అభివృద్ధి పనులకు గాను 9.5 కోట్లు జిహెచ్ఎంసి నిధులు మంజూరైనట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. గురువారం జిహెచ్ఎంసి కార్యాలయంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో హస్తినాపురం డివిజన్ కు తొమ్మిదిన్నర కోట్లు మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం బైరమల్ గూడా హస్తినాపురం డివిజన్లో వార్డ్ కార్యాలయాల నిర్మాణాలకు 6.5 కోట్లు వెంకటేశ్వర కాలనీ అగ్రికల్చర్ కాలనీ విశ్వేశ్వరయ్య కాలనీలో సిసి రోడ్ల నిర్మాణ పనులకు 3 కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు.గత రెండు సంవత్సరాల కాలంలో కోట్లాది రూపాయలు హస్తినాపురం డివిజన్ కు మంజూరు చేయించి అభివృద్ధి చేయిస్తున్నట్లు తెలిపారు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కాలనీల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతుంది అన్నారు.

# సహస్రచండీ మహాయాగాని కి హాజరైన కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**

లోక కల్యాణం కోసమై,దేశ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ రేణుక రాజరాజేశ్వరి పీఠం ఆధ్వర్యంలో జగన్మాతసేవలో శ్రీ మెల్లూరి నవీన్ శర్మ నిర్వహణలో రాగన్నగూడలో నిర్వహించబడుతున్నమహారుద్ర సహిత సహస్రచండీ మహాయాగానికి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆ అమ్మవారి దివ్య ఆశీస్సులను పొందడంజరిగింది.ఈకార్యక్రమంలో పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు వెంకట్రాంరెడ్డి,బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, తదితరులు ఉన్నారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# నాగోల్ ఆర్టీఓ కార్యాలయంలో రోడ్డు భద్రత మహోత్సవాలు.







**ప్రజావినికిడి,(నాగోల్):**
నాగోల్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ నందు ఇంచార్జ్ ఆర్టీఓ అమర్నాథ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మహోత్సవాల భాగంగా డ్రైవింగ్ లైసెన్సు కోసం వచ్చిన అభ్యర్థులకు అలాగే ఆర్టీఏ సిబ్బందికి కామినేని హాస్పిటల్ డాక్టర్ కిరీటి ఆధ్వర్యం లో ఫ్రీ మెడికల్ క్యాంపు ఏర్పాటు చెయ్యటం జరిగింది. ఈ కార్యక్రమంలో బోన్ డెన్సిటీ,పిఎఫ్టీ టెస్ట్,బీపీ షుగర్. ఈసీజీ పరీక్షలు నిరవహించటం జరిగింది. అంతే కాకుండా ఈ కార్యక్రమంలో సర్వేజనా స్వచ్ఛంద సమస్త వారి సౌజన్యంతో యమధర్మరాజు వేషధారణలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై



రోడ్డుపై వెళ్తున్న వాహనదారులకు అవగాహన కలిపిస్తూ హెల్మెట్,సీట్ బెల్టు అదేవిధంగా ట్రాఫిక్ రూల్స్ పాటించడం పై ఎల్ఈడి తెరపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోఆర్టీఓ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిభవంతులైన విద్యార్థులకు స్కాలర్షిప్ ఇవ్వడం అభినందనీయం

## :మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ..



**ప్రజావినికిడి, (హైదరాబాద్):** తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహకారంతో నిర్వహించినముత్తూట్ ఎం. జార్జ్ ఎక్సలెన్స్ అవార్డులు, స్కాలర్షిప్ లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ నెర్రెల్ల శారద, తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కార్తిక్మహేశ్వరం, చైర్పర్సన్ బెల్లం మాధవి తో పాటు ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్షిప్ లు అందజేశారు. విద్యార్థులకు స్కాలర్షిప్ అందజేయడం అభినందనీయమని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. విద్యార్థులకు స్కాలర్షిప్లు ఇవ్వడం తో కుటుంబాలలో ఆనందం, ఆత్మవిశ్వాసం భవిష్యత్తుపై ఆశను నింపినట్లు అయిందని పేర్కొన్నారు

# అంతరాయం లేకుండా రాష్ట్రంతో విద్యుత్ సరఫరా

**రాజస్థాన్, గుజరాత్ విధానాలు అధ్యయనం చేయాలి**
**పునరుత్పాదక ఇంధన రంగాల పనులు వేగవంతం చేయాలి**
**ఉస్మానియా తదితర ఆస్త్రులు నిర్మాణం వేగంగా సాగాలి**
**అధికారులతో సమీక్షలో సిఎస్ రామకృష్ణారావు సూచన**

హైదరాబాద్,**జనవరి29ప్రజావినికిడి**
రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. అలాగే, పునరుత్పాదక ఇంధన రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల అమలులో నిర్ణీత కాలపరిమితులను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన, వైద్య ఆరోగ్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టిజిఐఐసి, భారత ఫ్యూచర్ సిటీ , ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తదితర శాఖల పనితీరుపై విభాగాల వారీగా గురువారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, టిజి ట్రాన్స్కో, టిజి జెన్కో, టిజి ఎస్పిడిసిఎల్, టిజి ఎన్పిడిసిఎల్ విభాగాలలో కొనసాగుతున్న ప్రతిపాదిత ప్రాజెక్టుల పురోగతి, అలాగే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో విద్యుత్ రంగంలో అమలవుతున్న విధానాన్ని పరిశీలించి మన రాష్ట్రంలో కూడా వివిధ డిస్కంలలో అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతిపై సి.ఎస్ కు వివరించారు. ఇ-గవర్నెన్స్, తదితర అంశాలు, అండర్ గ్రౌండ్ కేబులింగ్, విజన్ 2047 లక్ష్యాలు, గ్రేటర్ హైదరాబాద్ భవిష్యత్ విద్యుత్ అవసరాల మేరకు ప్రతిపాదించిన చంద్రవెల్లి, రాయదుర్గం, షాద్ నగర్, పరిగి లో విద్యుత్ సబ్ స్టేషన్ల పనుల పురోగతి పై సి.ఎస్ సమీక్షించారు. ఃాష్ట్రంలో వరంగల్, ఆల్వాల్, సనత్ నగర్, ఎల్.బి.నగర్, న్యూ ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రి విస్తరణ పలు ప్రాంతాలలో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల పురోగతి, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, వైద్య సదుపాయాల లభ్యత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల సరఫరా, వైద్య శాఖలో నర్సింగ్, వైద్యుల నియమకాలు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఇహెచ్ఎస్ పథకం, వైద్య పరికరాల సరఫరా తదితర అంశాలపై సి.ఎస్ సమీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సి.ఎస్ ఆదేశించారు. ముఖ్యంగా



గ్రామీణ, దూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, పథకాల అమలుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న సి.ఎస్, లక్ష్యాల సాధనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. మాతా?శిశు ఆరోగ్యం, సంక్రమణ రోగాల నియంత్రణ, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆసుపత్రుల్లో పరిశుభ్రత, రోగులకు సౌకర్యాలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జి.హెచ్.యం.సి పరిధిలో చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం, ఆల్వాల్, సనత్ నగర్, ఎల్.బి.నగర్, వరంగల్ ఆసుపత్రుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. నూతన ఆసుపత్రుల అవసరాలకు మేరకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్లు, ఇతర నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఐటీఈ / సీ శాఖలో ప్రస్తుత కార్యకలాపాలు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై అధికారులు సి.ఎస్ కు వివరించారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ పెట్టుబడుల ఆకర్షణ, స్టార్టప్ ఎకోసిస్టం అభివృద్ధి, ఈ-గవర్నెన్స్ సేవల విస్తరణ, సైబర్ సెక్యూరిటీ, రాష్ట్రంలో ఉన్న 12,751 గ్రామ పంచాయతీలలో టి ÷బైర్ విస్తరణ పై సమీక్ష చేశారు. రాష్టాన్ని ఐటీ రంగంలో మరింత పోటీగా నిలిపే దిశగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం, యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా ఐటీ రంగంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ సేవలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించే దిశగా చర్యలు తీసుకోవాలని, వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఐటీ సేవలను ప్రజలకు సులబతరంగా అందించేందుకు ఒక చిఠజీబిబం÷ఔ రూపొందించాలని, మీసేవ కేంద్రాలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆధికారులకు సూచించారు. రాష్ట్రంలో వీలైనంత మేరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో టి్గ-÷బైర్ విస్తరణకు తగు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మైన్స్ శాఖలో ఇసుక సరఫరా పై సాండ్ రీచ్ లలో ఏర్పాటు చేసిన సి.సి.టివీల ఏర్పాటు, ఇటీవల కాలంలో చేపట్టిన సంస్కరణలపై అధికారులు సి.ఎస్ కు వివరించారు. భారత ఫ్యూచర్ సిటీ, టిజి ఐఐసి చేపట్టిన పనుల పురోగతి పై సి.ఎస్ సమీక్షించారు. ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ విభాగాలలో చేపట్టిన ప్రాజెక్టులపై సి.ఎస్ సమీక్షించారు. గత మూడు రోజులుగా ఇప్పటి వరకు (13) విభాగాలను ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. రాబోయే రెండు రోజులలో మిగతా విభాగాల సమీక్షకు సిద్ధమవుతున్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, నవీన్ మిట్టల్, మైన్స్ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, హెచ్ యం.డి.ఎ. కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె.శ్రీదేవి, టిజి ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, టిజి ఎస్పిడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ కమిషనర్ శశాంక, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, ఐటి ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా, టిజి ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ యం.డి. ఆశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోగుల సహాయకులకు అన్నదానం



**ప్రజావినికిడి, (నాంపల్లి):** ఎం.ఎన్.జె.క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు వారి సహాయకులకు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేనీ (ముజీబ్) నేడు అన్నదానం చేశారు. అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి వారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఈ సేవలో భాగంగా ఈ వారం కూడా డాక్టర్ ముజీబ్ స్వయంగా పాల్గొని రోగులకు భోజన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చికిత్స కోసం వచ్చే పేద రోగులకు వారి సహాయకులకు ఆకలి బాధలు కలగకూడదనే ఉద్దేశంతో ప్రతి వారంఈ అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని,ఈ సేవా యజ్ఞం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టి.ఎన్.జి.ఓ హైదరాబాద్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఖాలెద్ అహ్మద్, శంకర్ పాల్గొన్నారు. వీరితో పాటు ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆస్పత్రి యూనిట్ ప్రెసిడెంట్ శివ కుమార్, కార్యదర్శి చంద్ర శేఖర్, తెలంగాణ ఉర్దూ ఆఫీసర్స్ అధ్యక్షుడు జాయినుద్దీన్, జిల్లా యూనిట్ సభ్యులు నయీమ్,హరీష్, హైదరాబాద్ జిల్లా ఏ.పీ.ఆ.ర్వో మహ్మద్ వహీద్,మహ్మద్ ముస్తాఫా తదితరులు పాల్గొని రోగులకుసేవలు అందించారు.

## కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం రేవంత్ రెడ్డి

# దుర్మార్గపు పాలనకు నిదర్శనం

**కేసీఆర్ చేసిన అభివృద్ధి తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర**

**ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**ప్రజావినికిడి ,(కొత్తూరు):**తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వటం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుర్మార్గపు పాలనకు నిదర్శనమని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ప్రారంభించిన పథకాలు అమలు చేయలేక ఈ ప్రభుత్వం ఇలా డ్రామాలకి తెరలేపారని,తెలంగాణ కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయని వ్యక్తి కేసీఆర్ గారని అలాంటి వ్యక్తిని మీ రాజకీయ లబ్ధికోసం,చిల్లర ప్రయోజనాల కోసం ఆయన వ్యక్తిత్వాన్ని ఆయనస్థాయిని పలుచన చేస్తాం అంటే మీ తరం కాదని,కేసీఆర్ చేసిన అభివృద్ధి తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్రని,ఈ రేవంత్ రెడ్డి దుర్మార్గ పాలనను తెలంగాణ సమాజం గమనిస్తుందని ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేరోజు వస్తుందని ఎమ్మెల్సి నవీన్ రెడ్డి అన్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అభివృద్ధి పనులుప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయండి :


## మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



హైదరాబాద్,**జనవరి29ప్రజావినికిడి** : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పూర్తి అయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ లు, ప్రజా ప్రతినిధులను ప్రారంభోత్సవ కార్యక్రమాలలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. గురువారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన 11 వ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం లో జరిగింది.

# స్కామ్‌లకు కేంద్రంగా తెలంగాణ


## మండిపడ్డ బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్



న్యూఢిల్లీ,**జనవరి29ప్రజావినికిడి**
తెలంగాణ రాష్ట్రంలో స్కామ్‌లు వేగంగా పరిగెడుతున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారని.. కానీ అమలు కావడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడిచినా, వైఫల్యాలను మెరుగుపరచడానికి కాలయాపన చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కుంభకోణాలు, అవినీతి, మంత్రుల మధ్య గొడవలు రోజువారీ వార్తలుగా మారాయని లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రం స్కామ్‌లకు పరిశోధన కేంద్రంగా మారిందని ఆయన అన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంపై స్పందిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రోజువారీ టీవీ సీరియల్‌గా మార్చారని, రోజుకో పేరును ప్రస్తావిస్తూ సిట్ పేరిట కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ సాధించలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులను శిక్షించిన పాపాన పోలేదని ఎంపీ విమర్శించారు. తెలంగాణలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందనే అనే భయంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి గేమ్ ఆడుతున్నాయని ఎంపీ ఆరోపించారు. మున్సిపాలిటీలలో కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు. 106 మున్సిపాలిటీల అభివృద్ధికి ఎన్ని కోట్లు ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం స్మార్ట్ సిటీ, పట్టణాల అభివృద్ధి కోసం పని చేస్తోందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తేనే ప్రోగ్రెస్ జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఒక వర్గాన్ని సంతోషపరచడం కోసమే పని చేస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ.. ఓ ఫెయిల్యూర్ నాయకుడు అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు.

# కెసిఆర్‌కు నోటీసులు కక్షసాధింపు చర్య

## ఇది ప్రతీకారం తప్ప మరోటి కాదు -ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్,**జనవరి29ప్రజావినికిడి** విచారణల పేరుతో మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, నోటీసులతో చరిత్రను చెరిపేయలేరని కేటీఆర్ వెల్లడించారు. ఇది విచారణ కాదు.. ఇది ప్రతీకారం. ఇది న్యాయం కాదు.. ఇది రాజకీయ దురుద్దేశం. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు. నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరు. తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ఈ కక్షసాధింపు రాజకీయాలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది.'చావు నోట్లో తలబెట్టి.. కేసీఆర్ సచ్చుడో – తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని సంకల్పంతో సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్. సాధించిన తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని, రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకుంటూ సాగునీటి విప్లవం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు వంటి పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజనరీ కేసీఆర్. అడ్డగోలు హామీలు ఇచ్చి, అబద్దాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, ఇప్పుడు విచారణల పేరుతో కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనం' అని కేటీఆర్ అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తాం. తెలంగాణ చరిత్రను విచారణలతో కాదు.. ప్రజల తీర్పుతోనే రాస్తారు' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# ముల్కనూరులో వైభవంగా సమ్మక్కసారలమ్మ జాతర

## సమ్మక్క గద్దెపైకి రాక సందర్భంగా గన్ ఫైర్‌తో అధికారిక స్వాగతం



**భీమదేవరపల్లి జనవరి29ప్రజావినికిడి**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో నిర్వహిస్తున్న సమ్మక్కసారలమ్మ జాతరలో భాగంగా గురువారం సమ్మక్కను గద్దెపైకి తీసుకువచ్చే ఘట్టం అత్యంత వైభవంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సమ్మక్క గద్దెపైకి రావడం సందర్భంగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి గాల్లోకి కాల్పులు జరిపి ప్రభుత్వ తరఫున అధికారిక స్వాగతం పలికారు. గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన ఫైరింగ్ సంప్రదాయాన్ని ప్రభుత్వం ఉత్తర్వుల ద్వారా పునరుద్ధరించడంతో ఈ ఏడాది జాతరలో ఈ ఘట్టం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తుల "సమ్మక్క తల్లి కీ జై" నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగగా, సంప్రదాయ వాయిద్యాల నడుమ సమ్మక్కను గద్దెపైకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన సమ్మక్కసారలమ్మ జాతరలో పాల్గొనడం తనకు గర్వకారణమని తెలిపారు. సమ్మక్కను గద్దెపైకి తీసుకువచ్చే పవిత్ర ఘట్టంలో ప్రభుత్వ ప్రతినిధిగా గన్ ఫైర్ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జాతరను శాంతియుతంగా, భక్తుల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్, ఎల్కతుర్తి, వంగర ఎస్సైలు రాజు, ప్రవీణ్ కుమార్, దివ్య, ముల్కనూర్ సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, ఆలయ జాతర చైర్మన్ జక్కుల ఐలయ్యతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మక్కసారలమ్మ జాతర గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపుతూ, భక్తుల విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనంగా కొనసాగుతోంది.

# ఏపీలో 2 లేన్ల జాతీయ రహదారులను 4 లేన్లుగా మార్చండి

## ఏపీలో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి,**జనవరి29ప్రజావినికిడి**
రాష్ట్రంలో రోడ్ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయంలో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 2 లేన్లుగా ఉన్న జాతీయ రహదారులను 4 లేన్లుగా విస్తరించేందుకు తక్షణమే ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో రాష్ట్రంలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణ, రాష్ట్ర రహదారుల అభివృద్ధి, రోడ్ డెన్సిటీ పెంపుదల వంటి కీలక అంశాలపై చర్చించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పురోగతిని, కొత్తగా చేపట్టాల్సిన రహదారుల నిర్మాణం గురించి అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టుల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఒక బెంచ్‌మార్క్‌గా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పనుల్లో నాణ్యత, వేగం పాటించాలని స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, జాతీయ రహదారుల సంస్థ (చీనాా×)కు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చెవిరెడ్డికి బెయిల్

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసు

**ముగ్గురికి బెయిల్ మంజూరు..మరో ఇద్దరికి రద్దు**

**226 రోజుల జైలు జీవితాన్ని గడిపిన చెవిరెడ్డి**

**సజ్జల శ్రీధర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడులకు కూడా బెయిల్**



అమరావతి**జనవరి29ప్రజావినికిడి**
ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడులకు ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. అయితే.. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న రాజ్ కసిరెడ్డి, ముప్పిడి అవినాశ్ రెడ్డి బెయిల్ పిటిషన్లను మాత్రమం న్యాయస్థానం కొట్టివేసింది. బెయిల్ వచ్చిన ముగ్గురికి కోర్టు పలు షరతులను విధించింది. ప్రధానంగా పాస్‌పోర్టులను మేజిస్ట్రేట్ కోర్టులో సమర్పించాలని, న్యాయమూర్తి అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని ఆదేశించింది. అదే విధంగా బ్యాంక్ అకౌంట్లకు సంబంధించి కూడా పలు కీలక ఆదేశాలు జారీ చేసింది హైకోర్టు. ఈ షరతులకు సంబంధించి పూర్తి వివరాలు అందాల్సి ఉంది. ఇక ఈ కేసులో ఇప్పటికే ఐదుగురికి బెయిల్ మంజూరు అయిన విషయం తెలిసిందే. ఇందులో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఓఎస్డీగా ఉన్న కృష్ణమోహన్ రెడ్డి, జగన్ సెక్రెటరీగా ఉన్న ధనుంజయ్ రెడ్డితో పాటు భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప, రాజంపేట ఎంపీ అవినాశ్ రెడ్డి సహా మరొకరికి బెయిల్ వచ్చింది.

# మేడారం జాతరను జాతీయపండుగగా గుర్తించాలి

## కేంద్రానికి విజ్ఞప్తి చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మేడారం,**జనవరి29ప్రజావినికిడి** :తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండోసారి సమ్మక్క-సారక్క జాతర ఇదేనని, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతరను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భక్తుల సౌకర్యార్థం అనేక శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టిందని రాష్ట్ర మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మేడారంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, సమ్మక్క?సారక్క జాతరను 'జాతీయ పండుగ'గా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇప్పటికే పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రుల పర్యటనతో ఈ అంశం త్వరలోనే సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మక్క-సారక్క జాతరను గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా, మరో కుంభమేళాగా ఆయన అభివర్ణించారు. ఈ మహాజాతర విజయవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేసిన అధికారులు, సిబ్బంది మరియు సహకరించిన మీడియా మిత్రులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సూచనల మేరకు ఇన్‌ఛార్జ్ మంత్రి పర్యవేక్షణలో కేవలం 90 రోజుల్లోనే ఆలయ అభివృద్ధి పనులు మరియు మౌలిక వసతులు పూర్తి చేసినట్లు తెలిపారు. సాధారణంగా నాలుగు రోజులపాటు జరిగే జాతరను, ఈసారి భక్తుల రద్దీ దృష్ట్యా విస్తృత ఏర్పాట్లతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు జాతర ప్రశాంతంగా, సవ్యంగా కొనసాగుతోందని పేర్కొంటూ, జిల్లా కలెక్టర్, ఎస్పీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, ఇతర జిల్లాల నుంచి వచ్చి సేవలందించిన సిబ్బంది మరియు సమాచారాన్ని ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గద్దెల పునర్నిర్మాణం సహా మౌలిక సదుపాయాల పనులు నిర్ణీత కాలంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం గారికి విజ్ఞప్తి చేసినట్లు, అలాగే జాతర నిర్వహణకు మరింత ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ కేంద్ర మంత్రులకు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. లక్షలాది మంది భక్తులు హాజరవుతున్న ఈ మహాజాతరలో వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంటూ, జాతర విజయవంతానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు మరియు మీడియా మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

-------------------

# సమ్మక్కసారలమ్మ జాతరలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు

## భక్తుల సంప్రదాయాన్ని గౌరవిస్తూ ముల్కనూర్ ఫైరింగ్‌కు ప్రభుత్వ అనుమతి





**భీమదేవరపల్లి/జనవరి29ప్రజావినికిడి**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ నిర్వహిస్తున్న సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవార్లను గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముల్కనూర్ స్థానిక నాయకులు, ప్రజల సహకారంతో సమ్మక్కసారలమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో అమ్మవార్లు గద్దెలపైకి వచ్చే సమయంలో కొనసాగిన ఫైరింగ్ సంప్రదాయం దాదాపు 20 సంవత్సరాలుగా నిలిచిపోయిందని, స్థానిక నాయకులు తన దృష్టికి తీసుకువచ్చిన తర్వాత డీజీపీ, సీపీ గారితో చర్చించి భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఈరోజు సాయంత్రం ఫైరింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. ఇది భక్తుల విశ్వాసానికి, సంప్రదాయానికి ప్రతీక అని, గత 44 సంవత్సరాలుగా అమ్మవార్లను గౌరవప్రదంగా జాతరలో కొనసాగిస్తూ వస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. లక్షలాది భక్తులు ఇక్కడ అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రాంతమంతా సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడి పంటలతో రైతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు చెప్పారు. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల రైతులు, అన్ని వర్గాల ప్రజలపై ఆ తల్లుల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కింది స్థాయి ప్రజల వరకు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగాలని, భవిష్యత్తులో మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు అమలు చేసే శక్తిని ప్రభుత్వం పొందాలని అమ్మవార్లను వేడుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# జంతువుల సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరు స్వీకరించాలి

**-తల్లిఅంజనాదేవి జన్మదినం సందర్భంగా జిరాఫీలు దత్తత**

**- ఏడాదిపాటు వాటి పోషణ ఖర్చులు భరిస్తానని ప్రకటన**

**-విశాఖ జూ పార్క్ ఆద్యంతం పరిశీలించిన పవన్‌కళ్యాణ్**

**- కంబాలకొండ ఎకో పార్క్లో కెనోపీ వాక్**



విశాఖపట్నం, **జనవరి29ప్రజావినికిడి**
పర్యావరణ సమతుల్యత,స్థిరత్వానికి వన్యప్రాణి సంరక్షణ చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరువన్యప్రాణి సంరక్షణలో భాగం కావాలనిరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు నిచ్చారు.తన తల్లి అంజనా దేవి జన్మదినాన్ని పురస్కరించుకొని విశాఖఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్ రెండు జిరాఫీలను పవన్‌దత్తత తీసుకున్నారు. ఏడాదిపాటు వాటి సంరక్షణకు అయ్యేఖర్చును భరించనున్నట్టు ప్రకటించారు. గురువారం ఉదయంవిశాఖ పర్యటనలో భాగంగా ఇందిరాగాంధీ జూ పార్కును పవన్‌కళ్యాణ్ పరిశీలించారు. జూ పార్క్ జంతువుల సంరక్షణ నిమిత్తం ప్రస్తుతం ఏర్పాటు చేసిన సౌకర్యాలకు సంబంధించి వివరాలుఅడిగి తెలుసుకున్నారు. జూపార్కు మరింత అభివృద్ధిచేసేందుకుఉన్న అవకాశాలపై అటవీశాఖ అధికారులతో ఆయన చర్చించారు.ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మన దేశంలోవన్యప్రాణుల సంరక్షణ అంశంలో జూపార్కులు చాలా ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. అంతరించిపోతున్న జీవ జాతులనురక్షిస్తున్నాయని, అంతకు ముందు విశాఖ ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కునుపవన్ కళ్యాణ్ పరిశీలించారు. మొదట జూ వెనుక గేటుకిసమీపంలో ఉన్న సీతాకోక చిలుకల పార్కును సందర్శించారు.పార్కులో ఎన్ని రకాల సీతాకోక చిలుకలు ఉన్నాయి? వలల మధ్యఉన్న వాటికి ఆహారం ఎలా అందిస్తారు? తదితర వివరాలు జూక్యూరేటర్ మంగమ్మను అడిగి తెలుసుకున్నారు. అటవీశాఖఎకరాల విస్తీర్ణంలో ఉన్న విశాఖ జూపార్క్ లో వందలాది వన్యప్రాణులు, పక్షులు ఆహ్లాదకర వాతావరణం మధ్య జీవిస్తున్నాయన్నారు. వాటి సంరక్షణ మనందరి బాధ్యత అని, అయితే జూ పార్కులఅభివృద్ధిలో కార్పొరేట్లు భాగస్వాములు కావాలని పవన్ కళ్యాణ్‌పిలుపునిచ్చారు. తమకు నచ్చిన జంతువును ఎంచుకొని వాటిసంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. తమ కుటుంబం మొత్తంజంతు ప్రేమికులమని. జంతు సంక్షణపై చాలా శ్రద్ధపెడతారని,తమ ఇంట్లో నాలుగు కుక్కలను పెంచుతున్నామన్నారు.జూలో నూతనంగా ఎలుగుబంట్ల కోసం ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్ ను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. జూలో ఉన్న రెండు నల్లఎలుగుబంట్ల వివరాలు తెలుసుకుని, వాటికి ఆహారంఅందించారు. జింకలపార్క్, జూలో ఉన్న సింహాలు, ఆఫ్రికన్‌మకావు జాతి చిలుకలు, పులులను తిలకించారు. వారి రక్షణకుతీసుకుంటున్న చర్యలు, జూలో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపైచర్చించారు. జూపార్క్ లోని ఏనుగులశాలను సందర్శించారు. జూనిబంధనలు పాటిస్తూ శానిటైజ్ చేసుకుని ఏనుగుల వద్దకు వెళ్లివాటికి ఆహారం అందించారు. అనంతరం జూ పార్క్ లో ఉన్నజిరాఫీల ఎంక్లోజర్ వద్దకు వెళ్లారు.అధికారులు బటర్ ఫ్లై పార్క్ వదిలేందుకు సేకరించిన వివిధరకాల సీతాకోక చిలుకలను పవన్ కళ్యాణ్ పార్కులోకి విడుదలచేశారు.

# లడ్డూ కల్తీ పాపం జగన్ అండ్ కో..దే

## కల్తీ నెయ్యి వాడారని సిట్ తేల్చింది -వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



ఒంగోలు **జనవరి29ప్రజావినికిడి**
జగన్ హయాంలో తిరుపతి లడ్డూను కల్తీ చేశారని.. ఆ పాపం జగన్ అండ్‌కో దేనని ఏపీ వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. కోట్లాదిమంది భక్తులు ఆరాధించే తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడారని సిట్ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. కెమికల్స్ ఉపయోగించి లడ్డూ తయారు చేశారని ఆగ్రహించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై సత్యకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.250 కోట్ల అవినీతి చేసిన వాళ్లని జైలుకు పంపితే దాన్ని రెడ్‌బుక్ రాజ్యాంగం అని ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ప్రకాశం జిల్లాలో మంత్రి సత్యకుమార్ గురువారం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తప్పు చేసిన వాళ్లని వదిలేయండి, రప్పా రప్పా అన్న వాళ్లని వదిలేయండి, తలలు ఎగరేసి నరుకుతామనే వాళ్లని ఉపేక్షించాలనేలా జగన్ మాట్లాడుతున్నారన్ని ÷ర్ అయ్యారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీల వల్ల.. ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని స్పష్టం చేశారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఓ వ్యక్తిగత విషయాన్ని వైసీపీ బూతద్దంలో చూపిస్తోందని మంత్రి సత్యకుమార్ దుయ్యబట్టారు. 'వ్యక్తిగత విషయాలను కూటమి ప్రభుత్వానికి రుద్దే ప్రయత్నం వైసీపీ చేస్తోంది. జగన్ మాటలు చూసి ఆయన అవగాహన రాహిత్యంపై నవ్వొస్తోంది. సొంత బాబాయ్‌కు గొడ్డలి పోటు వేసి గుండెపోటుగా నమ్మించాలని జగన్ చూశారు. సొంత చె÷-లలెలి మీదే తండ్రిని చంపిన కేసు మోపేందుకు కుట్రపన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చి భూములు కొట్టేయాలని ప్రయత్నించారు. సొంత ఖజానా నింపుకోవడం కోసం నాణ్యత లేని మద్యం అమ్మి ప్రజల ప్రాణాలు తీయడం జగన్‌కు పాపంగా అనిపించడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావించకుండా బాధ్యతలు విస్మరించి అసత్య ప్రచారాలు చేసుకుంటున్నారు' అని మంత్రి ధ్వజమెత్తారు. కదిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గర్భిణి మరణిస్తే.. ఆస్పత్రి మూసివేశామని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. 'ప్రభుత్వ ఆస్పత్రిలో మరణించినట్లుగా వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంపై గౌరవముంటే జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. వారానికి ఒకరోజు విజిటర్ పొలిటీషియన్‌లా జగన్ ఏపీకి వచ్చి పోతున్నారు. జగన్‌కు ఇప్పటికే ప్రజలు గుణపాఠం చెప్పారు. ఆత్మ విమర్శ చేసుకుని సరైన మార్గంలోకి రాకపోతే.. మీ రాజకీయ సమాధి మీరే కట్టుకున్నట్లే. ఏపీలో అమాయకులను మా ప్రభుత్వం అరెస్ట్ చేయలేదు. మద్యం కేసులో ఉన్నవాళ్లు, ప్రజల ప్రాణాలు తీసినవాళ్లు, పోలింగ్ బూతుల్లోకి వెళ్లి గొడ్డలితో దాడులు చేసిన వాళ్లే అరెస్టయ్యారు' అని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పర్యాటకంగా రాష్ట్రం అభివృద్ధి

## అనకాపల్లి ఉత్సవ్ ఏర్పాట్లు పరిశీలించిన అనిత

అనకాపల్లి**జనవరి29ప్రజావినికిడి**




రాష్ట్ర పర్యాటక రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. గురువారం అనకాపల్లి జిల్లాలో అనిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనకాపల్లి ఉత్సవ్ నేపథ్యంలో ముత్యాలమ్మపాలెం తీరంలో.. విద్యుత్ దీపాలు, బీచ్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్, లైవ్ బ్యాండ్, ఫుడ్ స్టాల్స్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా ఉన్నారు. అనకాపల్లి ఉత్సవ్‌ను ఈనెల 30, 31 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని హోం మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో ఏపీలో పర్యాటక శాఖ అభివృద్ధి చెందుతోందని చెప్పుకొచ్చారు. గతంలోనూ విశాఖపట్నం ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించామని ఆమె గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక కళాకారులకు ఈ ఉత్సవాల్లో అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని హోం మంత్రి తెలిపారు. ఈ మేరకు ముత్యాలమ్మపాలెం తీరంలో అనేక కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. కొండకర్లలోనూ వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని వివరించారు. అనకాపల్లిలో ఫ్లవర్ షో, క్రాకర్స్ షో, సంగీత విభావరి సహా కార్నివాల్‌నూ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. గజ ఈతగాళ్లను కూడా తీరంలో సిద్ధంగా ఉంచుతున్నామన్నారు.

# గీతం ఆధీనంలో 54.79 ఎకరాల భూమి

## క్రమబద్ధీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా ఆందోళన
## అడ్డుకున్న గీతం భద్రతా సిబ్బంది

విశాఖపట్నం**జనవరి29ప్రజావినికిడి**



గీతం యూనివర్సిటీ ఆధీనంలో ఉన్న 54.79 ఎకరాల భూమి క్రమబద్ధీకరణను వైసీపీ వ్యతిరేకిస్తోంది. గురువారం ఆ భూములను పరిశీలించేందుకు విశాఖపట్నంలోని వైసీపీ నేతల బృందం వెళ్లింది. ఈ బృందాన్ని మెయిన్ గేట్ వద్ద గీతం యూనివర్సిటీ భద్రతా సిబ్బంది అడ్డుకుంది. దీంతో ఆ బృందంలోని సభ్యులు యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద నిరసన చేపట్టారు. దాంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానిక పోలీసులు రంగంలోకి దిగి.. ఆ బృందాన్ని అక్కడ నుంచి తరలించేందుకు చర్యలు చేపట్టారు. గీతం యూనివర్సిటీ ఆధీనంలో ఉన్న 54.79 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కౌన్సిల్ తీర్మానాన్ని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను విశాఖపట్నంలోని వైసీపీ కార్పొరేటర్లతోపాటు స్థానికంగా ఆ పార్టీ నేతలు సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అందుకోసం ఈ భూములు పరిశీలించేందుకు సదరు బృందం గురువారం గీతం యూనివర్సిటీ వద్దకు చేరుకుంది. ఆ బృందం యూనివర్సిటీలోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని.. ఆందోళనకు దిగిన వైసీపీ నేతలను అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారు.

------------

# రెండు లారీలు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ సజీవ దహనం

కాకినాడ,**జనవరి29ప్రజావినికిడి** కత్తిపూడి వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఓ లారీని మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. 16వ నంబర్ జాతీయ రహదారిపై లారీ యూటర్న్ తీసుకుంటుండగా.. అదే సమయంలో వేగంగా వస్తున్న మరో లారీ ఢీకొట్టింది. దీంతో ఓ లారీలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దాంతో డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. ఆ రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలార్పేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి బాధ్యుడైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదం కారణంగా.. జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఇక సజీవ దహనమైన డ్రైవర్ స్వస్థలం కోల్‌కతా అని పోలీసులు వెల్లడించారు.

# అమెరికా, చైనాలపై ఆధారపడటం మంచిది కాదు

## టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, ఏఐల విషయంలో జాగ్రత్త పడాలి -కేంద్రాన్ని హెచ్చరించిన ఆర్థిక సర్వే



న్యూఢిల్లీ,**జనవరి29ప్రజావినికిడి**
వస్తువులు, సేవల విషయంలో అమెరికా, చైనాలపై ఆధారపడటం మంచిది కాదని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. మరీ ముఖ్యంగా టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, ఏఐ, ట్రేడ్ కంట్రోల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. లేదంటే అమెరికా, చైనా దేశాల మధ్య భారత్ క్రాస్ ఫైర్ అవ్వక తప్పదని తెలిపింది. కేంద్ర బడ్జెట్ 2026 - 27 సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో 'ది ఎకనామిక్ సర్వే 2025 - 26' భారత్‌ను హెచ్చరించింది. అమెరికా, చైనాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఎకనామిక్ సర్వే ప్రకారం.. ప్రపంచ రాజకీయాల్లో చైనా, అమెరికా దేశాల మధ్య గట్టి పోటీ నడుస్తోంది. చైనాను అన్ని రంగాల్లో వెనక్కు తోసేయాలని అమెరికా.. అమెరికాను అన్ని రంగాల్లో వెనక్కు తోసేయాలని చైనా పావులు కదుపుతున్నాయి. అమెరికా ఆధిపత్యం సాగిస్తున్న రంగాలపై చైనా దృష్టి సారించింది. అమెరికా కూడా అదే పని చేస్తోంది. ఒకే విధమైన ఆలోచనలు ఉన్న దేశాలను కలుపుకొని సెక్యూర్ ఏఐ ఎకోసిస్టమ్‌ను తయారు చేయాలని అమెరికా చూస్తోంది. సాధారణంగా అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, క్రిటికల్ ఏపీఐలు, సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో ఆధిపత్యం కొనసాగిస్తున్న దేశాలే ప్రపంచ రాజకీయాల్లో పవర్‌ను కలిగి ఉంటాయి. భారత్ ఈ రెండు దేశాలపై ఆధారపడటం తగ్గించాలి. వస్తువులు లేదా సేవల విషయంలో ప్రత్యామ్నాయం లేని దేశంగా తప్పకుండా ఎదగాల్సిన అవసరం ఏంతైనా ఉంది. అలా చేయకపోతే ప్రపంచ రాజకీయాల్లో భారత్ పట్టు కోల్పోతుంది. అమెరికా, చైనాల మధ్య జరిగే గొడవల వల్ల భారత్ ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. చైనా గనుక దిగుమతులపై ఆంక్షలు విధించినా లేదా ధరల్ని పెంచినా దాని ప్రభావం భారత తయారీ రంగంపై తీవ్రంగా ఉంటుంది. అలాగే అమెరికా.. పాలసీలను కఠినతరం చేస్తే దాని ప్రభావం భారత సర్వీస్ సెక్టార్‌పై తీవ్రంగా ఉంటుంది.

# తెలంగాణలో పట్టణ పోరుకు రంగం సిద్ధం !

**జనవరి29ప్రజావినికిడి**
ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు పండగ. సవాళ్లు, ప్రతి సవాళ్లతో కాలం గడిపేయవచ్చు. అనుయాయులను గెలిపించుకునేందుకు ఆరాటపడం తప్ప మరోటి ఉండదు. మొన్నటికి మొన్న తెలంగాణలో గ్రామాల్లో పంచాయితీ ఎన్నికల సందడి ముగిసింది. ఇప్పుడు మున్సిపల ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయ పార్టీల్లో హడావిడి జోరందుకుంది. పార్టీ పరంగానే ఎన్నికలు జరగనున్న కారణంగా అధికార, విపక్ష పార్టీలు రాజకీయంగా పట్టు సాధించాలంటే మున్సిపాలిటీల్లో పదవులను గెల్చుకోవాల్సి ఉంటుంది. తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టడం, గెలిపించుకోవడం కోసం గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో పట్టణాలు, గ్రేటర్ హైదరాబాద్ ఇప్పుడు రాజకీయ రణక్షేత్రాలు కానున్నాయి. మొత్తంగా మున్సిపల్ పోరు మొదలైంది. తాజాగా ఎన్నికల కమిషన్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. బుధవారం నుంచి నామినేషన్ల ఘట్టం మొదలయ్యింది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. మొత్తంగా పంచాయితీ తరవాత ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. ఈ ఎన్నికల పక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయ్యింది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత పొందిన వారి జాబితా ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగా ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేపడతారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. షెడ్యూల్ విడుదలతో పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించుకొని పట్టణాలపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. షెడ్యూల్ రావడంతో తమ ప్రయత్నాల్లో అభ్యర్థులు తలమునకల య్యారు. సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే అభ్యర్థులు ఖర్చుకు మొగ్గ చూపుతారు. పురపోరులో పాల్గొనదల్చిన అభ్యర్థులు ఇప్పటికే భారీగా ఖర్చు పెట్టారు. ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో మళ్లీ ఖర్చులకు తెరలేవనున్నది. ఇదిలా ఉంటే పట్టు నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు తహతహ లాడుతున్నాయి. పార్టీ గుర్తింపు ఎన్నికలే అయినా తమ అభ్యర్థులను గెలిపించు కునేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టాయి. ఇకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో నామినేషన్ల పర్వం కూడా మొదలయ్యింది. ఒకే రోజు పోలింగ్, ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి చేపట్టబోతున్నారు. పట్టణాలు, వార్డుల్లో మళ్లీ దావత్‌ల జోరు అందుకోనుంది. ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తన చేతులో ఉన్న అధికారాన్ని అడ్డంగా వాడుకుంటుండటంపై బిఆర్ఎస్, బిజెపిల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో పోటీ చేయాలనుకొనే ఆశావహులు మద్దతు కూడగట్టు కునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. తమ వర్గాలు, గ్రూపులను పోగేసుకోవడంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తలు, అనుచరులను కోరుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొందరు అభ్యర్థులు తమ భార్యలను రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పార్టీల పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా పోటీలో నిలిచేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో పడ్డారు. అభ్యర్థులకు కేవలం రెండు వారాలు మాత్రమే ప్రచారానికి సమయం దొరుకుతోంది. ఒకింత మంచిదే అయినప్పటికీ ఎన్నికల ఖర్చు తడిసి మోపెడు అవుతుందనే బాధ కూడా అభ్యర్థుల్లో ఉంది. మొత్తంగా పట్టణాల్లో హడావిడి కొనసాగుతోంది. ఓటర్లకు మాత్రం ఇది ముమ్మాటికీ పండగే.



# ఓటమితో గుణపాఠం నేర్చుకున్నాం

● టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్



వైజాగ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో ం20 మ్యాచ్‌లో భారత జట్టు 50 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. సొంత గడ్డపై భారత్‌కు ఇది రెండో అతిపెద్ద ఓటమిగా నమోదైంది. గతంలో దక్షిణాఫ్రికా చేతిలో 51 పరుగుల తేడాతో ఓడిపోయింది. సిరీస్‌ను ఇప్పటికే కైవసం చేసుకున్న భారత జట్టు, ఈ మ్యాచ్‌లో పలు ప్రయోగాలకు దిగింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పోస్ట్-మ్యాచ్ ఇంటర్వ్యూలో పేర్కొన్న ప్రకారం, జట్టు ఒక బ్యాట్స్‌మెన్‌ను తగ్గించుకుని, ప్రారంభంలో రెండు వికెట్లు కోల్పోయిన తర్వాత 180-200 లక్ష్యాన్ని ఛేదించాలనే ఇలా చేశామని చెప్పాడు. మొదట బ్యాటింగ్‌లో అద్భుతాలు చేశాం. ఒకవేళ 180 లేదా 200 చేజ్ చేయాలనుకున్నప్పుడు రెండు లేదా మూడు వికెట్లు కోల్పోతే మిగిలిన బ్యాటర్లు ఎలా ముందుకు తీసుకెళ్తారన్నది ఆలోచించాం. ప్రపంచకప్ స్క్వాడ్‌లో ఉన్న ఆటగాళ్ల అందరికి ఛాన్స్ ఇవ్వాలనుకున్నాం. ఇట్స్ ఏ గుడ్ చాలెంజ్. మళ్లీ అవకాశం వస్తే ఈసారి చేజ్ చేస్తాం. గుణపాఠం నేర్చుకున్నాం' అని సూర్య అన్నాడు.న్యూజిలాండ్ 215 పరుగులు చేయగా, భారత్ ఛేదనలో 165 పరుగులకే ఆలౌట్ అయింది. శివమ్ దూబే 23 బంతుల్లో 65 పరుగులు చేసి అద్భుతమైన పోరాటం కనబరిచాడు. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్ రెండు వికెట్లు, కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీశారు. న్యూజిలాండ్ తరపున టిమ్ సైఫర్ట్, డెవాన్ కాన్వే బలమైన భాగస్వామ్యం నెలకొల్పగా, మిచెల్ సాంట్నర్ అద్భుతమైన బౌలింగ్ (3/26)తో రాణించాడు. ఈ ఓటమి టీ20 ప్రపంచ కప్ ముందు జట్టుకు కొన్ని పాఠాలను నేర్పింది.

# మహేష్ బాబు నా ఫేవరేట్ తెలుగు హీరో

● టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు అంటే తనకు చాలా ఇష్టమని టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ తెలిపాడు. ఖాళీ సమయంలో మహేష్ బాబు సినిమాలు చూస్తానని, ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడే సమయంలో తెలుగు సినిమాల గురించి సహచర ఆటగాళ్లతో బాగా చర్చిస్తానని చెప్పుకొచ్చాడు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమా తనకు పిచ్చెక్కించిందని తెలిపాడు. ఈ సినిమాలోని అల్లు అర్జున్ మేనరిజమ్ తనను బాగా ఆకట్టుకుందని చెప్పాడు. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో అభిషేక్ శర్మ దుమ్మురేపుతున్నాడు. తొలి టీ20లో విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగిన అభిషేక్.. రెండో టీ20లో మాత్రం గోల్డెన్ డకౌట్ అయ్యాడు. మూడో టీ20లో మరోసారి తన విశ్వరూపం చూపించాడు. 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది 10 ఓవర్లలోనే మ్యాచ్ ముగించాడు. నాలుగో టీ20లో మరోసారి అభిషేక్ శర్మ గోల్డెన్ డకౌట్ అయ్యాడు. దాంతో ఈ మ్యాచ్‌లో భారత్ 50 పరుగుల తేడాతో చిత్తయ్యింది. ప్రత్యర్థి బౌలర్లకు సింహ స్వప్నంగా మారిన అభిషేక్ శర్మ.. టీమిండియాకు కీలక ప్లేయర్‌గా ఎదిగాడు. ఎంతలా అంటే అభిషేక్‌ను ఔట్ చేస్తే మ్యాచ్ గెలిచినట్లేనని ప్రత్యర్థి కెప్టెన్లు ఫీలయ్యేంత. గతంలో విరాట్ కోహ్లీ ఈ స్టార్‌డమ్‌ను సొంతం చేసుకోగా.. అతని స్థానాన్ని అభిషేక్ శర్మ ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడు.గత కొన్నేళ్లుగా ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న అభిషేక్ శర్మ.. తెలుగు అభిమానులకు సుపరిచితమే. సినిమా, క్రికెట్ అంటే పడిచచ్చే తెలుగు ఫ్యాన్స్.. అభిషేక్ శర్మ ఫేవరేట్ తెలుగు హీరో గురించి తెలుసుకునేందుకు తెగ ఆరాటపడుతున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ నిర్వహించిన ఒక ఫన్ ఇంటర్వ్యూలో అభిషేక్ శర్మ.. తన ఫేవరేట్ తెలుగు హీరో మహేష్ బాబు అని తెలియజేశాడు. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు మహేష్ బాబు సినిమాల గురించి, ఆయనకు ఉన్న క్రేజ్ గురించి తన సహచర తెలుగు ఆటగాళ్లను అడిగి తెలుసు కుంటుంటానని చెప్పాడు. తాను తెలుగు సినిమా చూస్తానని, అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమా బాగా నచ్చిందని చెప్పాడు. ఈ సినిమాలోని అల్లు అర్జున్ మేనరిజమ్స్‌ను మైదానంలో కూడా అనుకరించాడు. అల్లు అర్జున్ స్క్రీన్ ప్రెజెన్స్, డ్యాన్స్ ఇష్టమని ఓ ఇంటరాక్షన్‌లో తెలిపాడు. ఆర్ఆర్ఆర్ సినిమాపై సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురిపించాడు. ముఖ్యంగా నాటు నాటు పాట బాగుందని, ఎన్టీఆర్, రామ్‌చరణ్ అద్భుతమైని కొనియాడాడు. తెలుగు ప్లేయర్లు నితీష్ రెడ్డి, తిలక్ వర్మల సాయంతో తెలుగు డైలాగ్స్ నేర్చుకుంటానని చెప్పాడు. హైదరాబాద్ బిర్యానీ అంటే తనకు చాలా ఇష్టమని, రామోజీ ఫిల్మ్ సిటీలో సినిమా షూటింగ్ చూడాలని ఉందని తెలిపాడు.

# ఇషాన్ కిషన్ రీఎంట్రీ ఇవ్వనున్నాడా..?

● తిరువనంతపురం వేదికగా ఆఖరి టీ20



న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో హ్యాట్రిక్ విజయాలతో జోరు కనబర్చిన టీమిండియాకు ఊహించని పరాజయం ఎదురైంది. వైజాగ్ వేదికగా జరిగిన నాలుగో టీ20లో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 50 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. ఈ ఓటమితో టీమిండియా బలహీనతలు బయటపడ్డాయి. ఇరు జట్ల మధ్య ఆఖరి టీ20 తిరువనంతపురం వేదికగా శనివారం జరగనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ముందు టీమిండియా ఆడుతున్న ఆఖరి మ్యాచ్ ఇదే కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సిరీస్‌లో దారుణంగా విఫలమైన సంజూ శాంసన్ తన హోమ్ టౌన్‌లో చెలరేగి ఫామ్ అందుకుంటాడా లేక వైఫల్యాన్ని కొనసాగిస్తాడా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.ఆఖరి టీ20లోనూ శ్రేయస్ అయ్యర్‌కు నిరాశే ఎదురు కానుంది. టీ20 ప్రపంచకప్ జట్టులో భాగంగా ఉన్న ఆటగాళ్లందర్నీ ఆడించాలనే ఉద్దేశంతోనే ఇతర ఆటగాళ్లకు అవకాశం ఇవ్వడం లేదని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. ఈ క్రమంలోనే అయ్యర్ మరోసారి బెంచ్‌కే పరిమితం కానున్నాడు. నాలుగో టీ20కి దూరమైన ఇషాన్ కిషన్ రీఎంట్రీ ఇవ్వనున్నాడు.వరుసగా రెండు మ్యాచ్‌లు ఆడిన జస్‌ప్రీత్ బుమ్రాకు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా విశ్రాంతి ఇవ్వవచ్చు. ఒకవేళ అతన్ని కొనసాగించాలనుకుంటే హర్షిత్ రాణాపై వేటు పడుతుంది. నాలుగో టీ20లో రాణా ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. మరోసారి ఎక్స్‌ట్రా బౌలర్‌తో ఆడాలనుకుంటే మాత్రం ముగ్గురు పేసర్లు బరిలోకి దిగుతారు.వరుసగా మూడు మ్యాచ్‌లు ఆడిన కుల్దీప్ యాదవ్‌కు ఆఖరి టీ20 నుంచి విశ్రాంతి కల్పించవచ్చు. అక్షర్ పటేల్ గాయంతో దూరమవడంతో జట్టులోకి వచ్చిన కుల్దీప్ యాదవ్ వరుసగా మూడు మ్యాచ్‌లు ఆడాడు. గత రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉన్న వరుణ్ చక్రవర్తి.. కుల్దీప్ యాదవ్ స్థానంలో బరిలోకి దిగుతాడు. రవి బిష్ణోయ్‌ను తప్పించాలనుకుంటే కుల్దీప్ యాదవ్ జట్టులో కొనసాగుతాడు. ఆఖరి మ్యాచ్‌కు కూడా అక్షర్ పటేల్ దూరం కానున్నాడు.రుసగా నాలుగు టీ20ల్లో విఫలమైన సంజూ శాంసన్‌కు తన హోమ్ గ్రౌండ్‌లో ఆఖరి అవకాశం ఇవ్వనున్నారు. ఈ మ్యాచ్‌లో రాణించకపోతే సంజూ శాంసన్ తుది జట్టులో చోటు కోల్పోవడం ఖాయం. మిగతా బ్యాటింగ్ కాంబినేషన్‌లో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదు. సంజూకు జతగా అభిషేక్ శర్మ ఆడనుండగా.. ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే మిడిలార్డర్‌లో ఆడనున్నారు. హార్దిక్ బ్యాట్ ఝులిపించాల్సిన అవసరం ఉంది.

# టెన్నిస్‌లో షేక్ హ్యాండ్ వివాదం!



టెన్నిస్ కోర్టులో భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌ను తలపించేలా హై టెన్షన్ నెలకొంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సెమీఫైనల్ పోరులో క్రీడా స్ఫూర్తి కంటే రాజకీయ సెగలే ఎక్కువగా కనిపించాయి. ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలినా స్విటోలినా, బెలారస్ స్టార్ అరీనా సబలెంకా మధ్య జరిగిన ఈ మ్యాచ్ క్రీడాభిమానులను విస్మయానికి గురిచేసింది. సాధారణంగా టెన్నిస్ మ్యాచ్ ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత ఆటగాళ్లు నెట్ వద్ద చేతులు హ్యాండ్‌షేక్ ఇవ్వడం ఆనవాయితీ. కానీ ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్‌లో ఈ సంప్రదాయం కనుమరుగైంది. వరల్డ్ నంబర్-1 అరీనా సబలెంకా మ్యాచ్ ప్రారంభానికి ముందు సంప్రదాయబద్ధంగా ఫొటోల కోసం సిద్ధమవ్వగా.. ఎలినా స్విటోలినా ఆమెతో కలిసి ఫొటో దిగడానికి నిరాకరించారు.ఆ తర్వాత నెట్ దగ్గరకు వచ్చినప్పటికీ.. ఇద్దరూ కనీసం కళ్లలోకి చూసుకోలేదు, షేక్ హ్యాండ్ ఇచ్చుకోలేదు. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి రష్యా, బెలారస్ క్రీడాకారులతో చేతులు కలపకూడదనే ఉక్రెయిన్ ప్లేయర్ల నిర్ణయంలో భాగంగానే స్విటోలినా ఇలా చేశారు.రష్యాకు బెలారస్ మద్దతు ఇస్తున్న నేపథ్యంలో ఆ దేశ క్రీడాకారులతో చేతులు కలపడం తమ దేశ ప్రజలను అవమానించడమేనని స్విటోలినా భావిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా ఉక్రెయిన్ పక్షాన ఒక బలమైన రాజకీయ సందేశాన్ని ఇస్తున్నట్లు ఆమె గతంలోనే స్పష్టం చేశారు.కేవలం షేక్ హ్యాండ్ విషయంలోనే కాకుండా, మ్యాచ్ జరుగుతున్న సమయంలోనూ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒక ర్యాలీ సమయంలో సబలెంకా గట్టిగా అరవడంతో, అంపైర్ దానిని 'హింద్రెన్స్' (ఆటకు ఆటంకం)గా పరిగణించి పాయింట్ కట్ చేశారు. అంపైర్ నిర్ణయంపై సబలెంకా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వీడియో రివ్యూ కావాలని పట్టుబట్టి అంపైర్‌తో వాదించడంతో ఆట కాసేపు నిలిచిపోయింది. దీంతో మైదానంలో వాతావరణం మరింత వేడెక్కింది. ఇదిలా ఉండగా.. మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌లో ఎలినా స్విటోలినాపై ఘనవిజయం సాధించి అరీనా సబలెంకా వరుసగా నాలుగోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. రాజకీయ ఉద్రిక్తతల మధ్య సాగిన ఈ పోరులో సబలెంకా తన దూకుడుతో అభిమానులను అలరించింది. రాడ్ లేవర్ ఎరీనాలో జరిగిన ఈ హై-వోల్టేజ్ పోరులో సబలెంకా 6-2, 6-3 తేడాతో స్విటోలినాను మట్టికరిపించింది. కేవలం 1 గంట 16 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

# బయటపడ్డ భారత్ బలహీనత!



స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత్ తొలి ఓటమి చవిచూసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో హ్యాట్రిక్ విజయాలతో భారత్ జోరు మీదుండడంతో క్వీన్‌స్వీప్ పక్కా అని ఫ్యాన్స్ భావించారు. కానీ, బుధవారం విశాఖపట్టణంలో జరిగిన నాలుగో మ్యాచ్‌లో 50 పరుగులు తేడాతో కివీస్ నెగ్గింది. 216 పరుగుల భారీ ఛేదనలో భారత్ 18.4 ఓవర్లలో 165 స్కోర్‌కే పరిమితమైంది. దీంతో టీమ్‌ఇండియా అభిమానుల్లో ఓ విషయంపై ఆందోళన నెలకొంది.పొట్టి ఫార్మాట్‌లో టీమ్‌ఇండియా దూసుకుపోతున్నప్పటికీ, టీ20 వరల్డ్‌కప్ ముంగిట ఓ అంశం కలవరపెడుతోంది. టీ20ల్లో ఇప్పటికే భారత్ వరుసగా 11 సిరీస్‌ల్లో విజయం సాధించి జోష్‌లో ఉంది. అయితే 210ం పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మాత్రం తడబాటుకు గురవుతోంది. జట్టులో స్టార్ ప్లేయర్లు ఉన్నప్పటికీ టీ20 చరిత్రలో టీమ్‌ఇండియా ఇప్పటిదాకా 210 పరుగులకు పైగా లక్ష్యాన్ని ఒక్కసారి కూడా ఛేదించలేదు. దీంతో ఇది వరల్డ్‌కప్ ముంగిట భారత్‌కు బలహీనతే అని ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు.భారత్ ం20 క్రికెట్‌లో ఇప్పటిదాకా 118 సార్లు ఛేజ్ చేసింది. అందులో 80 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఇందులో ఒక్క మ్యాచ్‌లో కూడా 210ం టార్గెట్ లేకపోవడం గమనార్హం. మరో 34 టీ20ల్లో ఒటమి పాలైంది. మిగిలిన నాలుగు మ్యాచ్‌ల ఫలితాలు తేలలేదు.వాస్తవానికి టీమ్‌ఇండియా తొలుత బ్యాటింగ్ చేసిన సందర్భాల్లో భారీ స్కోర్లు సాధించింది. ఈ సిరీస్‌లోనూ మూడో మ్యాచ్‌లో 154 పరుగుల లక్ష్యాన్ని 10 ఓవర్లలోనే అందుకొని రికార్డు సృష్టించింది. అయితే ఆ తర్వాత మ్యాచ్‌లో మాత్రం డీలా పడిపోయింది. సిరీస్‌లో జోష్‌మీదున్న భారత్ 216 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోవడం అభిమానులకు నిరాశ కలిగించింది. త్వరత్వరగా వికెట్లు పడడం, ఒత్తిడి పెరిగిపోవడంతో ఓటమి చవిచూసింది.ఈ నేపథ్యంలో టీ20ల్లో 210 కంటే ఎక్కువ పరుగులు సాధిస్తే భారత్‌పై విజయం ఖాయం అనే పరిస్థితి తలెత్తింది. ఇది ప్రత్యర్థులకు అవకాశంగా మారుతోంది. ఒకవేళ తొలుత బ్యాటింగ్ చేసి 201కంటే ఎక్కువ రన్స్ చేస్తే, టీమ్‌ఇండియాను ఒత్తిడిలోకి నెట్టవచ్చు అని భావించే అవకాశం ఉంది. అందుకే ఇప్పటికైనా భారీ ఛేదనలో టీమ్‌ఇండియా ఒత్తిడికి లోనవకుండా, ఎంతటి లక్ష్యాన్నైనా అందుకునేలాగా జట్టులో మార్పు రావాలని ఆశిస్తున్నారు.మరో 9 రోజుల్లో పొట్టి కప్పు టోర్నమెంట్ షురూ కానుంది. ఇది మెగా టోర్నమెంట్ కాబట్టి, ఇందులో మేటి జట్లతోనూ ఆడాల్సి ఉంటుంది. ముఖ్యంగా నాకౌట్ మ్యాచ్‌ల్లో ఇలాంటి పరిస్థితి తలెత్తితే, పట్టు వీడకుండా పోరాడాల్సిందే. లేదంటే టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదం ఎదురయ్యే అవకాశం ఉంది.

# సెమీ ఫైనల్స్ రేసు నుంచి 6 జట్లు ఔట్..

ఐసీసీ అండర్-19 ప్రపంచ కప్ 2026లో మొత్తం 16 జట్లు పాల్గొన్నాయి. గ్రూప్ దశ నుంచి నాలుగు జట్లు నిష్క్రమించాయి. ఆ తర్వాత 12 జట్లు సూపర్ సిక్స్ మ్యాచ్‌లలో ఆడాయి. ఇప్పుడు, చాలా జట్లకు సూపర్ సిక్స్ దశలో ఒకే ఒక మ్యాచ్ మిగిలి ఉంది. 12 జట్లలో ఆరు జట్లు ఇప్పటికే నిష్క్రమించగా, మిగిలిన ఆరు జట్లలో నాలుగు సెమీ-ఫైనల్‌కు చేరుకుంటాయి. ఇది పాకిస్తాన్‌ను ప్రమాదకర స్థితిలో ఉంచింది.సూపర్ సిక్స్‌లలో గ్రూప్ 1లో ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, ఐర్లాండ్ ఉన్నాయి. ఆస్ట్రేలియా గ్రూప్‌లో తన స్థానాన్ని దాదాపుగా ఖాయం చేసుకుంది. ఐర్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాయి. శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్ మధ్య స్థానం కోసం తీవ్రమైన పోరాటం కొనసాగుతోంది. సూపర్ సిక్స్‌లోని రెండవ గ్రూప్‌లో, భారతదేశం సెమీ-ఫైనల్స్‌కు దాదాపు అర్హత సాధించింది. జింబాబ్వే, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ నిష్క్రమించగా. ఇప్పుడు, రెండు స్థానాల కోసం పాకిస్తాన్, ఇంగ్లాండ్, భారతదేశం మధ్య పోటీ జరుగుతోంది. మూడు మ్యాచ్‌ల్లో మూడు విజయాల నుండి టీమిండియా ఆరు పాయింట్లను కలిగి ఉంది. నెట్ రన్ రేట్ 3.337గా ఉంది. అదే సమయంలో, పాకిస్తాన్ మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాల నుంచి నాలుగు పాయింట్లను కలిగి ఉంది. నెట్ రన్ రేట్ 1.484గా ఉంది. పాకిస్తాన్ చివరి మ్యాచ్ ఫిబ్రవరి 1న భారత్‌తో జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో, పాకిస్తాన్ భారత్‌ను ఓడించడమే కాకుండా, నెట్ రన్ రేట్ పరంగా భారత్‌ను అధిగమించడానికి గణనీయమైన తేడాతో ఓడించాలి. లేకపోతే, భారత జట్టు సెమీ-ఫైనల్‌కు వెళ్లే మార్గం సులభం అవుతుంది.



# ఒప్పుకోకుంటే లేచి పోదామనుకున్నం

'మహానటి' కీర్తి సురేష్ తన చిన్ననాటి స్నేహితుడు, లాంగ్ టైమ్ బాయ్‌ఫ్రెండ్ ఆంటోనీ తట్టిల్‌ను ప్రేమ వివాహం చేసుకుని అభిమానులను సర్ప్రైజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా తన ప్రేమ, పెళ్లికి సంబంధించిన కొన్ని షాకింగ్ విషయాలను కీర్తి సురేష్ తాజాగా పంచుకుంది. తాము 15 ఏళ్లుగా ప్రేమలో ఉన్నామని, ఒకానొక దశలో తమ పెళ్లికి పెద్దలు అంగీకరించకపోతే 'లేచిపోయి' పెళ్లి చేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తమ పెళ్లి ఇంత వైభవంగా, అందరి సమక్షంలో జరుగుతుందని తాము అస్సలు ఊహించలేదని, కానీ చివరికి పెద్దల అంగీకారంతో గోవాలో కుటుంబ సభ్యుల మధ్య తమ వివాహం వేడుకగా జరిగిందని కీర్తి పేర్కొంది.

పెళ్లి సమయంలో జరిగిన భావోద్వేగ క్షణాలను గుర్తు చేసుకుంటూ, ఎప్పుడూ చాలా ధైర్యంగా, దృఢంగా ఉండే ఆంటోనీ తాళి కట్టే సమయంలో తొలిసారి ఎమోషనల్ అయ్యాడని ఆమె తెలిపింది. ఆయన కళ్లలో నీళ్లు చూడటంతో తాను కూడా భావోద్వేగానికి లోనయ్యానని, 15 ఏళ్ల నిరీక్షణ కేవలం 30 సెకన్ల మంగళసూత్ర ధారణతో ఒక అందమైన బంధంగా మారిందని కీర్తి ఆనందం వ్యక్తం చేసింది. ఆ క్షణం ఒక

కల నిజమైనట్లు అనిపించిందని, ఆ ఆనందంలో కన్నీళ్లు ఆగలేదని ఆమె చెప్పుకొచ్చింది. ప్రస్తుతం కీర్తి సురేష్ తన వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, వరుస సినిమాలతో కెరీర్ పరంగా కూడా దూసుకుపోతోంది.



# వరుసగా సినిమాలతో ప్రభాస్ బిజీ

వరుసగా సినిమాలు పూర్తి చేయడంలో ప్రభాస్ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాల చిత్రీకరణ సాగుతుండగా, 'కల్కి2' సినిమానీ పట్టాలెక్కించాలని నిర్ణయించారు. విజయవంతమైన 'కల్కి 2898 ఏడీ'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమే 'కల్కి 2'. నాగ్ అశ్విన్ కొంతకాలంగా ఈ సినిమా పూర్వ నిర్మాణ పనుల్ని చేస్తూ వస్తున్నారు. వచ్చే నెలలోనే ప్రారంభం కానున్న ఈ సినిమాకీ ప్రభాస్ కొన్ని రోజులు డేట్స్ కేటాయించినట్టు తెలుస్తోంది. అంటే... మళ్లీ మూడు సినిమాల్ని ఒకేసారి ముందుకు నడిపిస్తారన్నమాట. 'ది రాజాసాబ్' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా ఆయన కొత్త సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే ఉద్దేశంలో ఉన్నట్టు తెలుస్తోంది. నిజానికి ఒక సినిమా పూర్తయ్యాక మరొక సినిమా అనే పద్ధతికి ఎప్పుడో ఫుల్‌స్టాప్ పెట్టేశారు ప్రభాస్. ఆయన కొంతకాలంగా ఒకేసారి రెండు, మూడు చొప్పున సినిమాల్ని ముందుకు నడిపిస్తున్నారు. 'ది రాజాసాబ్' సినిమాతో బిజీగా ఉన్న సమయంలోనే, 'కల్కి 2898 ఎ.డి', 'ఫౌజీ' సినిమాల్నీ చేశారు. దేశవ్యాప్తంగా బలమైన మార్కెట్ ఉన్న ఆయన కోసం పలు కథలు సిద్ధం అవుతున్నాయి. అన్నీ కూడా పాన్ ఇండియా స్థాయిలో, భారీ హంగులతో రూపొందుతున్న కథలే. ఏడాదికి రెండు సినిమాలైనా ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే లక్ష్యంతో ఆయన ఆయా ప్రాజెక్టుల్ని వెంట వెంటనే పట్టాలెక్కిస్తూ వాటి కోసం డేట్లు కేటాయిస్తున్నారు.

# హైప్ క్రియేట్ చేసినా.. ప్రేక్షకులు ఆదరిస్తారా అన్నదే ముఖ్యం

## సినిమాల తీరుపై నటుడు విజయ్ సేతుపతి కామెంట్స్



తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ యాక్టర్ విజయ్ సేతుపతి. ప్రస్తుతం అరవింద్ స్వామితో కలిసి గాంధీ టాక్స్ సినిమాలో నటిస్తున్నాడు. సాదాసీదా నటనతో ప్రేక్షకులను కట్టిపడేయడం ఈ టాలెంటెడ్ నటుడి స్పెషాలిటీ అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నాడు మక్కళ్ సెల్వన్. ఈ రోజుల్లో చాలా మంది యాక్టర్లు, డైరెక్టర్లు తమ సినిమాలు ప్రేక్షకులను ఆకర్షించేందుకు హైప్ క్రియేట్ చేసేందుకు ఏదో ఒక విషయాన్ని హైలెట్ చేయాలని ప్రయత్నిస్తుంటారని తెలిసిందే. విజయ్ సేతుపతి తన అప్‌కమింగ్ మూకీ సినిమా 'గాంధీ టాక్స్' గురించి మాట్లాడాడు.. డైలాగ్స్ లేకుండా ఎమోషన్స్‌తో ప్రేక్షకులతో దగ్గరయ్యేందుకు రెడీ అవుతున్నారు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి. ప్రేక్షకులకు వినోదం కోసం థియేటర్లకు వస్తారు కాబట్టి ఫిల్మ్‌మేకర్స్ ప్రేక్షకులు అర్థం చేసుకోలేని విధంగా సినిమా తీయొద్దని సూచించాడు విజయ్ సేతుపతి. ఓ వైపు ప్రయోగాలకు వెల్ కమ్ చెబుతూనే.. మరోవైపు ప్రేక్షకులు ప్రత్యేకించి డబ్బులు చెల్లించి సినిమా చూసేందుకు వస్తున్నప్పుడు వారికి ఖర్చు భారమనిపించేలా సినిమా ఉండకూడదని అన్నాడు విజయ్ సేతుపతి. గాంధీ టాక్స్ స్పెషల్ సినిమా ఏం కాదు.. కానీ సరికొత్త సినిమా చూసిన అనుభూతిని మాత్రం తప్పకుండా ఇస్తుందని ధీమా వ్యక్తం చేశాడు. సినిమా సంప్రదాయ ఫార్మాట్ ను ఫాలో అవకపోవడంతో గాంధీ టాక్స్ చిత్రాన్ని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో టీం మెంబర్స్ అంతా మొదట ఆందోళన చెందారని.. అయితే దగ్గరి స్నేహితులకు స్పెషల్ స్క్రీనింగ్ వేసిన తర్వాత పాజిటివ్ స్పందన వచ్చిందని.. దాంతో సినిమాపై నమ్మంక పెరిగిందన్నాడు విజయ్ సేతుపతి. అయితే వారిచ్చిన ఫీడ్ బ్యాక్ సినిమా మార్కెట్ కోసం ఉపయోగపడదని కూడా చెప్పాడు. టీం అంతా ముందుగా ఈ చిత్రాన్ని సూపర్ హిట్ అవుతుందని ఆశలు పెట్టుకున్నారు. కానీ వారిప్పుడు సినిమా హిట్టవ్వాలని కోరుకుంటున్నారని చెప్పుకొచ్చాడు.



# యుఫోరియాతో విజయం సాధిస్తా: గుణశేఖర్

కొన్ని సంవత్సరాలు సినిమాలకు దూరంగా విలువైన సమయాన్ని వృథా చేశానని దర్శకుడు గుణశేఖర్ చెప్పారు. కానీ, ఇప్పుడు పూర్తిగా దృష్టిసారించినట్లు తెలిపారు. ఇకపై ఎలాంటి విరామం లేకుండా నిరంతరం సినిమాలు చేస్తానని, బలమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకురావడమే తన లక్ష్యమని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన యుఫోరియా సినిమాతో ముందుకు వచ్చారు. ప్రేమ కథలనైనా, దేశభక్తి చిత్రాలైనా, చారిత్రక సినిమాలనైనా తనదైన శైలిలో తెరకెక్కించగల దర్శకుడు గుణశేఖర్. ఇప్పుడాయన 'యుఫోరియా'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన కెరీర్ గురించి మాట్లాడారు. కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదని 'యుఫోరియా'తో హిట్‌ను సొంతం చేసుకుంటానన్న నమ్మకం ఉందన్నారు. గతంతో పోలిస్తే తన అనుభవం, ఆలోచనా విధానం ఇప్పుడు మరింత ఉన్నతస్థాయికి చేరాయన్నారు. రాబోయే ప్రాజెక్టులు మరింత ప్రత్యేకంగా ఉంటాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. 1992లో ఇండస్ట్రీకి వచ్చిన గుణశేఖర్ వరుస సినిమాలతో అలరించారు. 2015లో 'రుద్రమదేవి' తర్వాత 8 సంవత్సరాలు విరామం తీసుకున్నారు. తర్వాత 2023లో సమంతతో 'శాకుంతలం' తీశారు. అది కూడా అనుకున్నస్థాయిలో విజయం సాధించలేదు. ఇప్పుడు మూడేళ్ల తర్వాత 'యుఫోరియా' అనే కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను పలకరించనున్నారు. నేటి యువతకు, కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే వైవిధ్యమైన కథతో రూపొందిన చిత్రమిదని ఆయన తెలిపారు. భూమిక, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి ప్రధాన పాత్రలు పోషించారు.

# అమ్మా నీ ఆశీర్వాదమే నా బలం తల్లి అంజనాదేవి పుట్టినరోజు చిరు పోస్ట్



పదవులు, ఖ్యాతి, పేరు ఎంత ఉన్నా.. తల్లి ముందు మాత్రం ప్రతి కొడుకు చిన్నవాడే. అదే విషయాన్ని మరోసారి నిరూపించారు మెగాస్టార్ చిరంజీవి. కోట్లాది మంది అభిమానులకు ఆయన లెజెండ్ అయినా, తన తల్లి అంజనా దేవి ముందు మాత్రం ఒక సాధారణ కుమారుడిగా మారిపోతారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి చేసిన భావోద్వేగ పోస్ట్ ఇప్పుడు అభిమానులను హత్తుకుంటోంది. జనవరి 29 అంజనా దేవి పుట్టినరోజు కావడంతో, చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. 'అమ్మా.. నీ ఆశీర్వాదమే నా బలం. పుట్టినరోజు శుభాకాంక్షలు' అంటూ ఎక్స్ లో ఓ ఎమోషనల్ మెసేజ్‌ను పంచుకున్నారు. ఈ సందేశంతో పాటు ఒక ప్రత్యేక వీడియోను కూడా అభిమానులతో షేర్ చేశారు. ఆ వీడియోలో మెగా కుటుంబ సభ్యులందరితో కలిసి అంజనా దేవి గడిపిన అరుదైన క్షణాలు, కుటుంబ వేడుకల ఫోటోలు, మధురమైన జ్ఞాపకాలు కనిపిస్తున్నాయి. ఈ విజువల్స్ అభిమానులను మాత్రమే కాదు, సామాన్య ప్రేక్షకులను కూడా భావోద్వేగానికి గురిచేస్తున్నాయి. వీడియో విడుదలైన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెగా అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తూ అంజనమ్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. చిరంజీవి తన తల్లిపై ఉన్న ప్రేమను ఎప్పుడూ దాచుకోరు. ప్రతి ఏడాది ఆమె పుట్టినరోజు, మదర్స్ డే వంటి సందర్భాల్లో తప్పకుండా ఆమెను గుర్తు చేసుకుంటారు. షూటింగ్‌లు, రాజకీయ కార్యక్రమాలు, ఇతర బాధ్యతలతో ఎంత బిజీగా ఉన్నా.. తల్లితో సమయం గడపడానికి చిరు ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తారని సన్నిహితులు చెబుతుంటారు. కుటుంబ విలువలు, క్రమశిక్షణ, ఓర్పు, సహనం వంటి గుణాలు తన తల్లి నుంచే నేర్చుకున్నానని చిరంజీవి పలు సందర్భాల్లో వెల్లడించారు. మెగా కుటుంబానికి అంజనా దేవి ఒక అండగా, ధైర్యంగా ఉంటారని చిరు ఎప్పుడూ చెబుతుంటారు. గత ఏడాది కూడా ఆమె పుట్టినరోజును కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు.

# జోర్డాన్ వెళుతున్న జూనియర్ ఎన్టీఆర్..



యంగ్ టైగర్ ఎన్టీఆర్, సంచలన డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో భారీ బడ్జెట్ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్డేట్ బయటకు వచ్చింది. సినిమా నెక్స్ట్ షెడ్యూల్ ఫిబ్రవరి 5 నుంచి జోర్డాన్ జరగబోతోందని తెలుస్తోంది. హైవోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను ఈ షెడ్యూల్ లో చిత్రీకరించబోతున్నారు. ఈ కీలక షెడ్యూల్ షూటింగ్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లను చిత్ర యూనిట్ పూర్తి చేసింది. అయితే, షూటింగ్ ప్రారంభానికి రెండు, మూడు రోజుల ముందే జూనియర్ ఎన్టీఆర్ జోర్డాన్ కు వెళుతున్నట్టు సమాచారం. ముందే వెళితే అక్కడి వాతావరణానికి అలవాటు పడవచ్చనేది తారక్ ఆలోచనగా తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాపై ఇప్పటికే పాన్ ఇండియా లెవెల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613